నమ్మలేని నిజాలు

మతి మరుపు
ఆరోగ్యానికి మందు
అదొక వరం.

దొంగ కుక్కలు
పేదబువ్వపై దాడి
ఖులా దర్వాజా.

స్థానిక వైరం
పడమర చదువులు
తూర్పుకు దండం.

పాషాణ రాత్రి
బాధల కాళరాత్రి
కథల దారి.

దోపిడి సొమ్ము
తరాలకు ఖజానా
గొప్ప దొరలు

- రేడియమ్
సెల్: 9291527757

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

శ్రీనిజాలు

మోతీలాల్ ఆమరణకు
దిగిరాని సర్కార్ !
చలో టీ పీ సీ ఎస్సి
ధర్నాకే ఖరార్ !.

నిరసన గళా లెత్తినా
ఏమిటి రేవంతన్నా ?
నిరుద్యోగులపై ప్రేమ
లేదా రవ్వంతన్నా ?

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

హైదరాబాద్ గురువారం 4-7-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:262 పేజీలు:6 వెల: రూ.1/-

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత.. మంత్రి శ్రీధర్ బాబు

### -ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

కరీంనగర్, జులై 3 : పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని రాష్ట్ర



ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. బుధవారం పెద్దపల్లి జిల్లా పెద్దకల్వలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటి వనమహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఊరూరా ఉద్యమంలా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు.

రోజురోజుకు కాలుష్యం పెరిగిపోతుందని, మొక్కల పెంపకంతో కాలుష్య నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు, కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ అరుణశ్రీ, అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## సుధా మూర్తి ప్రసంగంపై ప్రధాని మోదీ ప్రశంసలు..

న్యూఢిల్లీ, జులై 3 : రాజ్యసభ ఎంపీ సుధామూర్తిపై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై ఆయన మాట్లాడుతూ.. సుధామూర్తి తన ప్రసంగంలో స్త్రీల ఆరోగ్య సమస్యల గురించి చర్చించినట్లు వెల్లడించారు.

మహిళల ఆరోగ్యం గురించి నవివరంగా మాట్లాడిన సుధామూర్తికి థ్యాంక్స్ చెబుతున్నానని ఆయన అన్నారు. ఆ సమయంలో సుధామూర్తి లేచి నిలబడి ప్రధానికి నమస్కరించారు. తల్లుల గురించి కూడా సుధా మూర్తి భావోద్వేగంగా ప్రసంగించినట్లు మోదీ తెలిపారు. సుధామూర్తి తన ప్రసంగంలో మాట్లాడుతూ.. తల్లి చనిపోయినప్పుడు ఆస్పత్రిలో ఒకరి మరణంగా నమోదు చేస్తారని, కానీ ఓ కుటుంబానికి ఆ తల్లి ఎప్పటికీ దూరమైనట్లే అని పేర్కొన్నారు.

## మొక్కలు పెంచండి.. కాలుష్యాన్ని అరికట్టండి

### - మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి పిలుపు

### -మొక్కలు నాటిన అమాత్యులు

### -మనం వందేళ్లు బతకాలంటే మొక్కలు పెంచాల్సిందే

### -మొక్కలు నరకడం పాపం.. అది మన జీవితాలకు శాపం

### -ఒక్కొక్కరూ అయిదు మొక్కలైనా నాటండి

### -మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి పిలుపు

ఖమ్మం, జులై 3 :కాలుష్యం నివారణకు మొక్కలను పెంచటమే మార్గమని మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. నేడు ఖమ్మం జిల్లా సత్తుపల్లి జరిగిన వన మహోత్సవ కార్యక్రమంలో ఈ ఇద్దరు అమాత్యులు పాల్గొని మొక్కలు నాటారు..

అనంతరం కొండా సురేఖ మాట్లాడుతూ.. గతంలో పెద్ద పెద్ద వృక్షాలు ఉండేవి, చల్లని నీడను ఇచ్చే చెట్లు ఇప్పుడు కనిపించటం లేదన్నారు. భవిష్యత్తు ముందు తరాలకు మంచి జరగాలి అంటే ఇప్పుడు నుండే మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. అశోక చక్రవర్తి భవిష్యత్తు గురించి ఆలోచించి మొక్కలు నాటారన్నారు. అవే మొక్కలు రోడ్లకు ఇరువైపులా ఉన్నాయన్నారు. డిపార్టమెంట్ కాక ఇళ్ళలో కూడా మొక్కలు నాటే బాధ్యత మీ అందరిపై ఉందన్నారు. గతంలో పందిర్లకు తీగలు మొక్కలు ఉండేవి? ఇప్పుడు చూద్దామన్న కనిపించటం లేదన్నారు. వాడ ఊరు బాగుండాలని లక్ష్యంతో అందరు మొక్కలు నాటాలన్నారు. ప్రజలను భాగస్వామ్యం చెయటం కోసమే మొక్కలు నాటే కార్యక్రమం చెపట్టామన్నారు. ఊర్లలో కోతుల బెడద చాలా ఉందని తెలిపారు. అడవుల నుండి కోతులు ఊర్లలోకి రాకుండా ఫారెస్ట్ అధికారులు చూసుకోవాలన్నారు. అడవిలో దొరికే ఫలాలను కోతులకు అందేలా చూడాలని తెలిపారు. సత్తుపల్లి అదర్శవంతగా ఉండాలన్నారు. కాలుష్యం నివారణ చెయ్యాలన్న మొక్కలను పెంచటమే ఒకే ఒక్క మార్గమని తెలిపారు. ప్రతి ఒక్కరు మొక్కను నాటాటమే లక్ష్యంగా భావించి మొక్కలు నాటి లక్ష్యన్ని చెరుకోవాలని తెలిపారు. రాబోయే రోజుల్లో వృక్షాలను పెంచి,కాలుష్య నివారణ చెపడతాని కొరుకుంటున్నామన్నారు.

వందేళ్లు మనం బతకాలంటే మొక్కలు పంచాల్సిందే ..

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా అనేక స్వచ్ఛంద పనుల్లో సత్తుపల్లి ఎమ్మెల్యే దంపతులు భాగం అవుతున్నారని తెలిపారు. మనిషి మనుగడ కలగాలి అంటే చెట్లను పెంచాలన్నారు. గతంలో పెద్దలు 100 సంవత్సరాలు బతికారు అంటే చెట్లే కారణం అన్నారు. ప్రతి నిత్యం మనిషి జీవితంలో చెట్లతో అవసరం ఉంటుందన్నారు. జ్ఞానం పెంపోదించుకోవాలన్న పచ్చని చెట్ల కిందకు వెళితే ప్రశాంతంగా ఉంటుందని తెలిపారు. చెట్లను నరకటం మహాపాపం అన్నారు. చెట్లను పెంచాలనే ఉద్దేశ్యంతో అవగాహన కార్యక్రమాలు జరుపుతున్నామని తెలిపారు. ఒక్కొక్క వ్యక్తి ఐదు నుండి పది మొక్కలు పెంచితే వన మహోత్సవ కార్యక్రమం విజయవంతం అవుతుందని తెలిపారు.

## మెటీరియల్ ట్రైనింగ్ మిషన్ కింద పడి కార్మికుడి మృతి

హైదరాబాద్, జులై 3 : బాచుపల్లి సూర్య గ్లోబల్ మోడల్ స్కూల్ వద్ద డాల్ఫిన్ నిర్మాణ సంస్థలో జరిగిన ప్రమాదం కారణంగా ఓ కార్మికుడు మృతిచెందగా, మరో కార్మికుడు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

డాల్ఫిన్ నిర్మాణ కంపెనీలో మెటీరియల్ ట్రైనింగ్ మెషిన్ మెయిన్ లైన్‌పై పడిపోవడం, విద్యుత్ వైర్లు తెగిపోవడంతో డాల్ఫిన్ నిర్మాణం వల్ల పవర్ సప్లై పూర్తిగా దెబ్బతింది.

మెయిన్ లైన్ పనులు పునరుద్దణ కార్యక్రమం జరుగుతుంది.. సమాచారం తెలుసుకున్న పోలీసులు ప్రమాద ఘటనపై వివరాలు సేకరిస్తున్నారు.

## మంత్రి పొంగులేటి.. పొలంబాట

హైదరాబాద్, జులై 3 :ఉరుకుల పరుగుల జీవితం, నిత్యం ఎక్కడో ఓ మారుమూల గ్రామంలో సమావేశాలు.. ఇక సెక్రటేరియట్‌కు వెళితే సంబంధిత శాఖపై అధికారులతో సమీక్షలు, రాష్ట్ర మంత్రులు క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు. అయితే, ఆ బాధ్యతల నుంచి కాస్త చిల్ అయ్యేందుకు మంత్రులు దైవ దర్శనాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు హాజరు అవుతుంటారు. కానీ, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రూటు మాత్రం సపరేటు.

బుధవారం ఉదయం ఆయన ఖమ్మం జిల్లా కల్లూరు మండలం, నారాయణపురం గ్రామంలో ఉన్న తన వ్యవసాయ క్షేత్రంలో కాస్త చిల్ అయ్యారు. ఏకంగా లుంగీ కట్టి తన వ్యవసాయ క్షేత్రంలో కలియ తిరిగారు. ఈ క్రమంలోనే తన పక్క పొలంలో ఉన్న రైతులతో మాట్లాడి వారి కష్ట సుఖాలను తెలుసుకున్నారు. మహిళలతోనూ సరదాగా ముచ్చటించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతుల పరిస్థితి ఎలా ఉందనే విషయంపై ఆరా తీశారు. అయితే, అందుకు సంబంధించిన ఫొటోలను మంత్రి స్వయంగా ట్విట్టర్‌లో షేర్ చేయగా.. ప్రస్తుతం అవి కాస్త నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి.

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ, జులై 3 :బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జ్యుడిషియల్ కస్టడీ పొడిగించారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ మనీ లాండరింగ్ కేసులో జులై 25వ తేదీ వరకు కవిత, మనీష్ సిసోడియా కస్టడీ పొడిగిస్తున్నట్‌అలు రౌస్ అవెన్యూ కోర్టు వెల్లడించింది.

ఈడీ కేసులో నేటితో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత, ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియా జ్యూడిషిల్ కస్టడీ ముగిసింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కవిత, మనీష్ సిసోడియాను కోర్టు ముందు అధికారులు హాజరు పరిచారు. తదుపరి విచారణ జూలై 25వ తేదీకి వాయిదా వేసింది కోర్టు. జ్యూడీషియల్ కస్టడీలో భాగంగా గత మూడు నెలల నుంచి కవిత తీహార్ జైల్లో ఉంటున్నారు.ఢిల్లీ మద్యం విధానం కేసులో కస్టడీలో ఉన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు రెండు రోజుల క్రితం తిరస్కరించిన సంగతి తెలిసిందే. సీబీఐ, ఈడీ నమోదు చేసిన కేసుల్లో ఊరట ఇవ్వాలని, బెయిల్ మంజూరు చేయాలని కవిత దాఖలు చేసిన రెండు పిటిషన్లను న్యాయస్థానం తిరస్కరించింది. సీబీఐ, ఈడీ వాదనలతో న్యాయస్థానం ఏకీభవిస్తూ బెయిల్‌ను ఇవ్వలేమని చెప్పింది. హైకోర్టు బెయిల్ తిరస్కరించిన నేపథ్యంలో కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం ఉన్నది.

## మంత్రి శ్రీధర్ బాబుతో నోకియా జర్మనీ ప్రతినిధి బృందం భేటీ



హైదరాబాద్, జులై 3 :సచివాలయంలో తెలంగాణా ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తో నోకియా జర్మనీ ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యింది. ఈ భేటీలో రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ పాల్గొన్నారు. 5జీ నెట్వర్క్ ని మరింత అభివృద్ధి చేసి పూర్తిగా అన్ని రంగాలకు అందించాలని కంపెనీ ప్రతినిధులను మంత్రి కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన, మెరుగైన విద్య అందించాలనే సంకల్పంతో క్వాడ్ జెన్ కంపెనీ వాళ్ళతో కలిసి ప్రతి పాఠశాలలో ఐడబ్ల్యూబీ ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. విద్యార్థులకు 20వేల లోపు ల్యాప్ టాప్స్ అందించే బృహత్తరమైన కార్యక్రమం చేపడుతున్నామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

ఈ భేటీలో నోకియా గ్లోబల్ హెడ్ మార్టిన్, సేల్స్ హెడ్ మ్యాన్క్, గ్లోబల్ డైరెక్టర్ వెంకట్, పద్మజ, రాజేష్, సీఎస్ రావ్, తదితరులు పాల్గొన్నారు.

## ఏఈఈ (సివిల్) ఉద్యోగుల జాబితా ప్రకటించండి- టీజీపీఎస్సీ చైర్మన్ తో కేటీఆర్

### -ఇటీవల కేటీఆర్ ను కలిసిన పరీక్ష రాసిన అభ్యర్థులు

### -దీనిపై టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డికి కేటీఆర్ ఫోన్ కాల్

### -22 నెలలైనా ఫైనల్ లిస్ట్ విడుదల చేయరా అంటూ ప్రశ్న

### -తక్షణం వారికి ఉద్యోగాలు ఇవ్వాలంటూ డిమాండ్



హైదరాబాద్, జులై 3 :బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు నిర్వహించిన ఏఈఈ (సివిల్) పరీక్షకు 1180 పోస్టులకు సంబంధించి అభ్యర్థుల ఎంపిక జాబితాను ప్రకటించటంలో కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఇప్పటి వరకు ఉద్యోగాలకు ఎన్నికైన వారి జాబితాను వెల్లడించకుండా ఆలస్యం చేస్తుందన్నారు. ఈ పరీక్ష రాసిన అభ్యర్థులు భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను ఇవాళ నందినగర్ లోని కేటీఆర్ ఇంట్లో కలిశారు. ఈ జాబితాను వెంటనే ప్రకటించేలా ప్రభుత్వంపైన ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డికి ఫోన్ చేసి మాట్లాడారు..

దాదాపు 22నెలల కిందే ఈ పరీక్షకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలై, ఎగ్జామ్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ కూడా గతేడాది సెప్టెంబర్ నాటికే పూర్తైందని ఆయనకు తెలిపారు. అభ్యర్థుల తుది జాబితా విడుదల చేయాల్సి ఉండగా ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిందని గుర్తు చేశారు.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నా.. ఇప్పటి వరకు ఈ తుది జాబితాను విడుదల చేయటం లేదని, దీంతో అభ్యర్థులు తీవ్ర గందరగోళంలో ఉన్నారని చైర్మన్ దృష్టికి తెచ్చారు. వెంటనే టీజీపీఎస్సీ ఛైర్మన్ మహేందర్ రెడ్డికి ఫోన్ చేసి మాట్లాడారు. వెంటనే ఎంపికైన అభ్యర్థుల జాబితాను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఇక తనను కలసిన అభ్యర్థులతో కేటీఆర్ మాట్లాడుతూ.. తప్పకుండా అండగా ఉంటానని వారికి భరోసా ఇచ్చారు.

## పూణెలో జికా వైరస్ కలకలం.. అన్ని రాష్ట్రాలకు కేంద్రం అడ్వైజరీ

న్యూఢిల్లీ, జులై 3 : మహారాష్ట్రలోని పూణె లో జికా వైరస్ కలకలం సృష్టిస్తోంది. ఇప్పటి వరకు ఆరు కేసులు నమోదయ్యాయి. ఈ వైరస్ బారినపడినవారిలో ఇద్దరు గర్భవతులు కూడా ఉన్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. మహారాష్ట్రలో జికా వైరస్ కేసుల దృష్ట్యా అన్ని రాష్ట్రాలకు అడ్వైజరీ జారీ చేసింది

ముఖ్యంగా గర్భిని స్త్రీలకు వైరస్ పరీక్షలు నిర్వహించాలని అన్ని రాష్ట్రాలను కేంద్రం ఆదేశించింది. పాజిటివ్ తేలిన తల్లుల పిండాల పెరుగుదలను పర్యవేక్షించడం ద్వారా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కోరింది. ఇంటి ఆవరణలో ఏడిస్ దోమలు లేకుండా చూసేందుకు నోడల్ అధికారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని సూచించింది. నివాస ప్రాంతాలు, కార్యాలయాలు, పాఠశాలలు, నిర్మాణ స్థలాలు, సంస్థలు, ఆరోగ్య సౌకర్యాల్లో కీటకాలు లేకుండా నిఘా పెంచాలని, నియంత్రణ కార్యకలాపాలను తీవ్రతరం చేయాలని రాష్ట్రాలను కేంద్రం ఆదేశించింది.కాగా, జులై 1న పూణెలో ఇద్దరు గర్భిణులు సహా ఆరుగురికి జికా వైరస్ పాజిటివ్ తేలిన విషయం తెలిసిందే. నగరంలోని అరంద్వానే ప్రాంతంలో నాలుగు, ముండ్వా ప్రాంతంలో రెండు కేసులు నమోదయ్యాయి. రాష్ట్ర ఆరోగ్యశాఖ తెలిపిన వివరాల ప్రకారం అరంద్వానేలో మొదటి కేసు నమోదయింది. 46 ఏండ్ల డాక్టర్ తొలుత జికా వైరస్ బారిపడ్డారు. అనంతరం అతని కుమార్తె (15)కు వైరస్ సోకినట్లు వైద్య పరీక్షల్లో తేలింది. వీరిద్దరితోపాటు ముండ్వాకు చెందిన ఇద్దరి రిపోర్టులు పాజిటివ్‌గా వచ్చాయి. ఈ నాలుగురితోపాటు అరంద్వానేకు చెందిన ఇద్దరు గర్భిణులకు జికా వైరస్ సోకినట్లు వైద్యులు గుర్తించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.జికా వైరస్ సోకిన ఆడ ఎడిస్ దోమకుట్టడం వల్ల వ్యాధి సంక్రమిస్తుంది. ఈ వైరస్‌ను తొలిసారి 1947లో ఉగాండా అడవుల్లోని ఓ కోతిలో గుర్తించారు. ఆ తర్వాత ఆఫ్రికన్ దేశాలతోసహా భారత్, ఇండోనేషియా, మలేషియా, ఫిలిప్పీన్స్, థాయ్‌లాండ్, వియత్నాం లాంటి ఆసియా దేశాలకూ ఈ వ్యాధి వ్యాప్తి చెందింది. ఈ వైరస్ సోకినవారిలో జ్వరం, చర్మంపై దద్దుర్లు, కండరాలు, కీళ్ల నొప్పులు, తలనొప్పి, జీర్ణకోశ సంబంధ సమస్యలు, గొంతు నొప్పి, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తాయి.

## కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజాపాలన - ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

### -నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



రంగారెడ్డి, జులై 3 : ప్రజాపాలన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటులో భాగంగా కొత్తూరు మండల పరిధిలోని మల్లాపూర్ తండా గ్రామపంచాయతీలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై శిలాఫలకాన్ని ఆవిష్కరించి, రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ మధుసూదన్ రెడ్డి, జడ్పిటిసి శ్రీలత సత్యనారాయణ, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరినాథ్ రెడ్డి, ఎంపిటీసీలు, మాజీ సర్పంచ్ లు అంబటి ప్రభాకర్, రవి నాయక్, మాజీ ఉప సర్పంచ్ దయానంద్ గుప్తా, దశరథ్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇందూరి శ్రీనివాస్, వీరమోని దేవేందర్ ముదిరాజ్, కర్రోళ్ల సురేందర్, గోవింద నాయక్, బోకుల రాజు, శ్రీరాములు, మల్లేష్, గ్రామ ప్రత్యేక అధికారి రవీందర్ రెడ్డి, మండల స్థాయి అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### చురక

కాళేశ్వరం జల కళ
కన్నీటితో విలవిల
వర్షనీరు సముద్రానికి
వెళ్లిపోతె సాగు ఎలా
ప్రాజెక్టు కుంగుబాటు
పనులల్లో అవినీతి
ప్రభుత్వం ఎవరిదైనా
ప్రబలిపోతె అధోగతి

-వేల్పుల నారాయణ
9440433475

### నేటి కందం- నేటికీ అందం

జనచైతన్యము మీరగ
ఘను లందరు మెచ్చ నమెరికా దేశమ్మో
దినమున మహితోన్నతముగ
గణతంత్రమ్మయ్యె నమెరి కనులు హసింపన్

(4-7-1776 అమెరికా స్వాతంత్ర్య దినం)

-రాధశ్రీ
సెల్:9494481210

## సునందామృతం

### తప్త తైలాంబు న్యాయము

తప్త అనగా వేడిచేయబడిన కాచబడిన అని అర్థం.తైలము అనగా నూనె.అంబు అనగా నీరు.

కాగుతున్న నూనెలో నీళ్ళు పడితే భగ్గుమని మండుతుంది. దీనినే మనుషులకు వర్తింప చేస్తూ చెప్పారు మన పెద్దలు.కోపంతో ఊగిపోయే వ్యక్తులకు, దుష్ట గుణాలున్న వారికి, హిత వచనాలు చెవికి ఎక్కవనీ, మంచి మాటలు చెప్పే వారిపై భగ్గుమని మండిపడుతూ, చెప్పే వారికే చెడు చేయాలని చూస్తుంటారనే అర్థంతో ఈ న్యాయము చెప్పబడింది.

కాబట్టి కోపంతో బుసకొట్టే వారిని,దుష్టత్వం ఉన్న వారిని పొరపాటున కూడా కదిలించ వద్దు. అలాంటి వారిని కదిలిస్తే ఏమౌతుందో మారద వెంకయ్య గారి భాస్కర శతక పద్యాన్ని చూద్దాం.

తడవగ రాదు దుష్ట గుణుదత్త మెరుంగ యెవ్వరైన
నా/చెడు గుణమిట్లు వల్లదని చెప్పిన గ్రక్కున గోప
చిత్తుడై/గడుదెగ జూచుగా మరుగ గాగిన తైలము
నీటి బొట్టు పై/బడునెడ నాక్షణం బెగసి భగ్గు మండక
యున్నె భాస్కరా!!'

అనగా దుష్టుల మనసు దుష్టత్వంతో నిండి ఉంటుంది కాబట్టి వారికి దూరంగా ఉండటమే మంచిది.వాళ్ళు దుర్జనులు అని తెలిసిన తర్వాత ఇక నీతులు చెప్పే సాహసం ఎట్టి పరిస్థితుల్లోనూ చేయకూడదు.ఎందుకంటే అలాంటి వారికి ఎలాంటి హిత వాక్యాలు చెవికెక్కవు. పైగా చెప్పిన వారికి చెడు చేయాలని చూస్తారు కూడా.

అదెలాగంటే బాగా కాగిన నూనె నీటి బిందువును ఎలాగైతే దహించి వేస్తుందో ఆ విధంగా అన్న మాట.

మన చుట్టూ ఉన్న సమాజంలో కొన్ని సంఘటనలు చూస్తుంటే ఈ న్యాయము అక్షర సత్యం అనిపించక మానదు.

ఆవేశంతో నోటికి వచ్చినట్లు తిట్టుకునే మూర్ఖుల మధ్యలో గానీ, కత్తులు దూసి దాడి చేసుకునే దుర్మార్గుల మధ్యలోకి గానీ వెళ్ళి సామరస్యం కుదర్చబోతే...అలా వెళ్ళిన వాళ్ళ వారితో పిచ్చి మాటలు పడటం, ఒకోసారి గాయాల పాలవ్వడం కూడా చూస్తూ ఉంటాం..

అలాంటి వారిని నిశితంగా గమనించే పెద్ద వాళ్ళు ఇదిగో ఈ "తప్త తైలాంబు న్యాయము''ను ఉదాహరణగా చెప్పారు.


-పురిమళ్ల సునంద
9441815722



# నేటి నిజం సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com

## నాగరికత



కొత్త కొత్త రుచులతో
నోరూరించే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు
అయిస్‌క్రీం పార్లర్లూ,
హొటళ్లూ, మోటళ్లూ
ఐమ్యాక్స్‌లూ, మల్టీప్లెక్స్‌లూ
పబ్బులూ, క్లబ్బులూ
సిగరెట్లూ, గుట్కాలూ
చిందులూ, విందులూ
తాగుళ్ళూ, తిరుగుళ్ళూ

ఎటు పయనిస్తుందో నగర యువత?
ఇది ఏ (అ) నాగరికతకి ప్రతీక?



-ఎన్.విజయా కిషన్ రెడ్డి
98488 68085

## ఘంటారావం

విరిసేది ఒకే వృక్షానాకైనా
విరుల దారులు వేరే
జన్మించేది ఒకే జననికైనా
జీవనయానాలు వేరే.

నిందలు వేస్తున్నారని
చిందులు వేయకు
ఆశలు అడియాసలైన
మనుషులని మరువకు.

అపరాధభావన లేని
ఆర్జన విధానాలు
అందమెక్కుతున్న
అక్రమ సంపాదనలు

నిరాశ
నిప్పులా కాలేస్తుంది
ఆశ
శ్వాసలా బతికిస్తుంది.

నీ ఆలోచనలే
నిన్ను నడిపిస్తాయి
నీదైన లోకంలోకి
నిన్ను ఆకర్షిస్తాయి



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964


# తూర్పుగాలి పరిమళం

తూర్పు మల్లారెడ్డి సాహిత్యకార్యకర్తగా అధ్యాపకుడిగా విమర్శకుడిగా పరిశోధకునిగా విస్తరించిన దీక్షాధ్యక్షుడు. కాస్త సంప్రదాయం, మరికాస్త అభ్యుదయం, ఇంకాస్త తెలంగాణ అస్తిత్వం నిలువెల్లావున్న కృషీవలుడు. ఆయన సంభాషణకు, విశ్లేషణకు పదునెక్కువ. భువనగిరికీ, ఏకశిల వాసులకు తనను తాను అంకితం చేసుకున్న మానవీయ మకుటం ఆయన. చిన్ననాటి నుంచి శ్రమైక జీవనం ఆయన నిత్య ప్రవర్తనం. స్నేహశీలి. సౌమ్యుడు. హిపోక్రసీకి ఆమడదూరం ఉండే మల్లారెడ్డితో నాళేశ్వరం శంకరం చేసిన చిరు సంహాషణ ఇది.

**మీ బాల్యం, విధ్యాభ్యాసం ఎలా సాగింది?**

మాది వికారాబాదు జిల్లా పూడూరు మండలం అంగడిచిట్టంపల్లి గ్రామం. చిన్నప్పుడే రెండు సంవత్సరాల వయసు ఉన్నప్పుడే నాన్న ఎల్లారెడ్డి మరణించాడు. అమ్మ ఆగమ్మ అన్నీ తానై పెంచింది. పూర్తిగా గురువుల ఆదరణతోనే విద్యాభ్యాసం సాగింది. ప్రాథమిక విద్యాభ్యాసం స్వగ్రామంలో ఉన్నత పాఠశాలలో జరిగింది. ఏడవ తరగతిలో మొదటి ర్యాంక్ వచ్చిన కారణంగా సర్వేల్ నల్లగొండ జిల్లా రెసిడెన్సియల్ పాఠశాలలో కొనసాగింది. ఆర్థిక పరిస్థితులు ఏమాత్రం అనుకూలంగా లేనందువల్ల ఉచిత విద్యాభ్యాసం కారణంగా మహబూబ్‌నగర్ జిల్లా కోడంగల్లులో డి.ఓ.ఎల్, బి.ఓ.ఎల్. పూర్తి చేసి ఎం.ఏ. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పూర్తి చేసి సర్వ ప్రథముడిగా నిలిచి బంగారు పతకం పొందాను. 1982లో భువనగిరి శ్రీలక్ష్మీ నరసింహస్వామి కళాశాలలో ఉపన్యాసకుడిగా చేరి బోధన చేస్తూనే పార్ట్‌టైంగా కాకతీయ విశ్వవిద్యాలయంలో 'కాళోజీ నారాయణరావు జీవితం-సాహిత్యం' అనే అంశంపై ఎం.ఫిల్ పొందాను. ఉస్మానియా విశ్వవిద్యాలయం లో 'ఆధునిక తెలుగు కవిత్వంలో తిరుగుబాటు ధోరణులు' అనే అంశంపై పి.హెచ్.డి. చేశాను.





'అన్వేషణ' ఆవిష్కరణ సందర్భంగా...

**భువనగిరి డిగ్రీ కళాశాలలో పని చేస్తున్నపుడు ఏమైనా సాహిత్య కృషి చేశారా?**

కళాశాలలో ఉపన్యాసకత్వం నిర్వహిస్తూనే సాయంకాలం సమయంలో సాహిత్య కృషి కొనసాగించాను. అప్పటికే భువనగిరిలో బాగా పని చేసిన 'యువ రచయితల సమితి' స్తబ్దంగా ఉంటే స్వాతంత్ర్య సమరయోధుడైన జైని మల్లయ్యగుప్త సహకారంతో పునరుద్ధరణకు పాటుపడి సాహిత్యాభిమానులను ఆ వేదికపైకి తీసుకొచ్చాను. తర్వాత భువన రచయితల సమితి' ద్వారా కొన్ని కార్యక్రమాలను నిర్వహించాను. మిత్రుడు సామ మల్లారెడ్డి భువనగిరికి రావడంతో ఇద్దరం కలిసి శ్రీనివాసాచారిని కూడా కలుపుకొని జైని మల్లయ్యగుప్త సహకారంతో 'సాహితీ మిత్రమండలి' ఏర్పాటు చేశాం. ప్రతి బుధవారం సాయంకాలం ఒక సాహిత్యాభిమాని ఇంట్లో సాహిత్య సదస్సును నిర్వహిస్తూ తెలుగు భాషాసాహిత్యాలపట్ల అభిరుచిని కలుగజేశాం. 1995లో తెలుగు సాహిత్య సమాలోచనోత్సవాలు గొప్పగా నిర్వహించాం.

**తెలంగాణ సాహిత్యోద్యమానికి పాటుపడ్డార?**

ప్రత్యేక తెలంగాణ పట్ల కాళోజీపై పరిశోధన చేస్తున్న క్రమంలోనే 1984 నుండే అభిమానం ఏర్పడింది. కాళోజీ రాసిన ప్రత్యేక తెలగాణోద్యమ గేయాలను గూర్చి ఆ మహానుభావునితో రోజుల తరబడి చర్చిస్తున్న క్రమంలో ప్రత్యేక రాష్ట్ర కాంక్ష పట్ల స్పష్టత ఏర్పడింది. గాదె ఇన్నయ్య,సామ మల్లారెడ్డి, శ్రీనివాసాచారి మొదలైన మిత్రులం భువనగిరిలో రాత్రి వేళల్లో చర్చలు జరిపి 'దగాపడ్డ తెలంగాణ' సదస్సు (1997) ఘనంగా నిర్వహించి ప్రత్యేక రాష్ట్ర కాంక్షను బలంగా వినిపించాం. ఈ సందర్భంలో ప్రభుత్వం ఉద్యమాన్ని అణిచివేయాలనే పట్టుదలతో ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేసింది. మాపై కూడా నిఘా పెట్టారు. అయినా ఉద్యమాన్ని ఆపలేదు. క్రమంగా ఉద్యమం విస్తరించడంలో సభలు- సమావేశాలు నిర్వహించే వాళ్ళం. మిత్రుడు శ్రీనివాసాచారి రాసిన *'తెలంగాణ బిడ్డలారా! దగాపడ్డ తమ్ములారా!'* అనే గేయాన్ని బెల్లి లలిత జనాకర్షంగా పాడేది. మొత్తం మీద ఉద్యమం రాష్ట్ర వ్యాప్తంగా బలపడసాగింది. ఆ క్రమంలో బెల్లి లలిత హత్యకు గురైంది. చక్కటి గాయకురాలిని కోల్పోయాం. 2007 కళాశాలలో *'తెలంగాణ సాహిత్యం- జీవిత చిత్రణం'* అనే సదస్సును నిర్వహించి తెలంగాణ సమాజం నేపథ్యంగా వచ్చిన రచనలు వెలికి తీయవలసిన ఆవశ్యకతను చాటి చెప్పాం. అవకాశం మేరకు తెలంగాణోద్యమకారుల కార్యక్రమాల్లో పాల్గొన్నాను.

**కాళోజీ అనగానే మీ పేరు గుర్తుకు వస్తుంది. వారిపై మీ పరిశోధనలో ప్రతిపాదించిన అంశాలు చెప్పండి?**

మానవ జీవితాన్ని సమాజాన్ని సూక్ష్మంగా పరిశీలించిన కవి కాళోజీ. బతుకు ఏ సిద్ధాంతపు సూత్రాలకు కట్టుబడదని ఆయన అభిప్రాయం. 'బతుకు పూజనీయం' అనే ఆల్బర్ట్ స్విట్జర్ అభిప్రాయం కాళోజీకి ఇష్టం. ప్రజల సమస్యలను, రాజకీయ, సామాజిక విషయాలను ప్రజల భాషలో ప్రజలకు విన్పించిన ప్రజాకవి కాళోజి. పాలకులపై పాలితుల ధిక్కార సంతకం కాళోజి. ప్రజల తరఫున పాలకులను ప్రశ్నించిన ప్రజావకీలు కాళోజి. ఆంధ్రప్రదేశ్ అవతరణ తర్వాత తెలం గాణ సమాజానికి, సాహి త్యానికి, భాషకు జరిగిన అన్యాయాలను పసిగట్టి ప్రజలకు తన కవితల ద్వారా వినిపించిన తెలంగాణ రాష్ట్ర స్వాప్నికుడు, దార్శనికుడు కాళోజి. అన్యాయం అంతం ఆయన పంతం. అన్యాయం అంతరిస్తే ఆయన 'గొడవకు ముక్తి ప్రాప్తి. అన్యాయాన్ని ఎదిరించే వాడు ఆయనకు ఆరాధ్యుడు. నిరసనకు, ప్రశ్నకు ఆయన ప్రతిరూపం. అన్ని రంగాలలో ప్రజలభాష వినియోగం కావాలన్నది ఆయన పలుకుబడుల స్వభావానికి ప్రతిరూపం కాళోజి.

**మీ సంపాదకత్వంలో 'తెలంగాణ సాహిత్యం-జీవిత చిత్రణం' ఎలా రూపుదిద్దుకుంది?**

మలిదశ తెలంగాణోద్యమ సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా గాదె ఇన్నయ్య భువనగిరికి వచ్చాడు. అప్పటికే భువనగిరిలో మేం స్థాపించిన 'సాహితీ మిత్రమండలి' కార్యక్రమాలు జనాకర్షకంగా సాగుతున్నాయి. ఇన్నయ్య నేను మిత్రుడు సామ మల్లారెడ్డి తదితరులు కలిసి జరిపిన చర్చల్లో భాగంగా 1997 మార్చి 8,9 తేదీలలో 'దగాపడ్డ తెలంగాణ' పేరుతో తొలిసారిగా పెద్ద ఎత్తున నిర్వహించాం. బహుశ మలిదశ తెలంగాణోద్యమానికి సదస్సు రూపంలో ఊపిరులూదిన మొదటి కార్యక్రమం ఇదేనేమో. అప్పటి నుండి తెలంగాణ సాహిత్యానికున్న ప్రత్యేక నేపథ్యాన్ని తీసుకు రావాలని ప్రయత్నం మొదలుపెట్టాను. కళాశాల మిత్రులు అగ్రెసివ్‌గా పోతున్నానని సూచించారు. నిధుల సమీకరణ అనుకున్నంతగా జరగలేదు. జాతీయ సదస్సు కోసం యు.జీ.సికి అప్లై చేశాను. మంజూరైంది. ఇక ధైర్యంతో జయశంకర్‌సార్, నందిని సిధారెడ్డి, నాళేశ్వరం శంకరం, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, కాసుల ప్రతాపరెడ్డి గార్లతో చర్చించి సదస్సు అంశాలను నిర్ణయించి 19 జులై 2007 నాడు కళాశాలలో సదస్సు నిర్వహించి దాన్ని పుస్తక రూపంలో తెచ్చాను. ఆ పుస్తకం మలిదశ తెలంగాణోద్యమంలో తెలంగాణ సాంస్కృతిక, సాహిత్య భూమిక నేపథ్యంలో నిర్వహించే అనేక సదస్సులకు ప్రేరణ నిచ్చింది. 'తెలంగాణ సాహిత్యం-జీవిత చిత్రణం'లో అనేక సాహిత్య ప్రక్రియల పరిణామ వివరాలు, సంస్కృతీపరంగా తెలంగాణ సమాజానికున్న ప్రత్యేకతలు వివరించబడ్డాయి.

**జైని మల్లయ్య గుప్తపై గ్రంథం ఎందుకు రాయాలనుకున్నారు? అందులో మీరు పొందుపరిచిన అంశాలు చెప్పండి?**

భువనగిరిలో ప్రఖ్యాత స్వాతంత్ర్య సమరయోధుడు జైని మల్లయ్య గుప్తగారు, మత సామరస్య జీవన ఆకాంక్షి. ఉర్దూభాషా పిపాసి. జన చైతన్య కార్యక్రమాలకు హార్థికంగా ఆర్థికంగా చేయూత నందించే చైతన్యశీలి. మా కళాశాల గౌరవ కోశాధికారి. ఆయనపై రాసిన జీవన రేఖలలో క్విట్ ఇండియా ఉద్యమంతో, నిజాం వ్యతిరేక పోరాటంతో రైతాంగ పోరాటంతో ఆంధ్రోద్యమంతో ఆయనకున్న పోరాటం సంబంధాలు, మున్సిపల్ మెంబర్‌గా ఆయన భువనగిరికి చేసిన సేవలను పేర్కొనడం ప్రధానంగా ఉన్న అంశాలు.

**'శ్రీరామ శతకం' తోనే కవితాత్మకశక్తి ఎందుకు ఆగిపోయింది?**


1982లో ఎం.ఏ. పూర్తికాగానే శ్రీలక్ష్మీ నరసింహస్వామి కళాశాల భువనగిరిలో తెలుగు శాఖలో తాత్కాలిక ఉపన్యాసకుడిగా చేరాను. నెలకు వెయ్యి రూపాయలు అలా పదేళ్ళ పని చేశాను. అస్థిరమైన ఉద్యోగం, ఆర్థికపరమైన ఇబ్బందులు, అప్పుడప్పుడే పిల్లలు పెద్ద చదువులకు ఎదగడం మొదలైన కారణాల వల్ల కవిత్వంవైపు వెళ్ళలేదు. ఒకే ఒక్క శతకంతో ఆగిపోయానుగాని ఇప్పటికే సాహిత్య విమర్శ, వ్యాసాలు రాస్తూనే ఉన్నాను.


**'ఆధునిక తెలుగు కవిత్వంలో తిరుగుబాటు ధోరణులు' అన్న మీ సిద్ధాంత గ్రంథంలోని మీదైన దృష్టి, దృక్పథం ఏముందో చెబుతారా?**

ఇది 1910-1970 వరకు గల కాలాన్ని పరిమితిగా తీసుకుని పరిశోధించాను. ధోరణి-తిరుగుబాటు-విప్లవం వీటి స్వభావాలను వివరించాను. ఏ కవిత్వమైనా సామాజిక పరిణామ క్రమాలలోనే పరిణామం చెందుతుంది. ఆ సమాజ పరిణామాలు స్వీయ సమాజంలోనివైనా కావచ్చు. ఇతర సమాజాల పరిణామ ప్రభావా లలోనివైనా కావచ్చు. ముఖ్యంగా తెలంగాణ సమాజంలోని పరిణామ క్రమాల నేపథ్యంలో వచ్చిన విషయాల దృక్ప థంలో భాగంగా ఆధునిక తెలుగు కవిత్వంలోని తిరుగుబాటు ధోరణులను మాత్రమే పరిశీలించాను.

**ప్రస్తుతం వెలువడుతున్న 'అన్వేషణ' గ్రంథం సాహిత్య వ్యాసాల గ్రంథమని ఎందుకన్నారు? 28 వ్యాసాలు సాహిత్య విమర్శలో భాగం కావా?**

అన్వేషణలో 28 వ్యాసాలు న్నాయి. ఇందులో కొన్ని వ్యక్తులపై రాసినవి కూడా ఉన్నాయి. అన్నీ సాహిత్య విమర్శకు సంబంధించినవైతే సాహిత్య విమర్శనా వ్యాసాలు అంటే బాగుంటుంది. కొంత వైవిధ్యం ఉన్న కారణంగా 'అన్వేషణ'ను సాహిత్య వ్యాసాలు అనే పేర్కొన్నాను.



ఇంటర్వ్యూ:
-డా॥ నాళేశ్వరం శంకరం
సెల్: 9440451960

## ఏడుకోలల బాయి

ఏమాయె రాజ్యంబులేమైరి రాజులు
ఏమాయె ప్రజకంత లేమిడాయె
రాచరికముబాయె రాజ్యాలుబాయెను
భూస్వామ్యముతొ వారి బలుపుబాయె
జనతంత్రమని కోరి గణతంత్రమును జేర
మన మనమ్మనకేమి మన్ననొచ్చె
సార్వభౌమత్వమ్ము నేరుగాప్రజకున్న
అమలు కాదు జనుల అసలు కోర్కె

ఎన్నిఎన్నికల్ రావాలి జనము గెలువ
ఎప్పుడేరీతి మారునో చెప్పలేము
పంచవర్షాన ప్రతిసారి పర్వదినమె
పంచవర్షనీబుకేరింత పట్టగలమె?

మాయమాటల హోమీల మర్మమెరిగి
గుర్తులేకుండ ఓటెట్ల గుద్దుతావు
ఓరి వెంకన్న! దోస్తుగా ఒర్లుబోతు!
ఒక్కమాటన్న వినవార! తిక్కలోడ!



-డా॥ఏనుగు నరసింహారెడ్డి
8978869183

## నవ షట్పదులు

పంటలు ఎల్లెడలా పండితే
ప్రజలందరికీ ప్రమోదమే!
అవినీతులు అనంతగా పెరిగితే
దేశమంతటికీ ప్రమాదమే!
విద్వేషాలు మాని జగమెల్ల మసలితే
విశ్వమంతటికీ వినోదమే!


కవులు, కళాకారుల్ని కించపరిస్తే
కలాలు సైతం కరవాలాలవుతాయి!
అట్టడుగు వర్గాల్ని అవమానిస్తే
అట్టడుగుకే పదవులు జారిపడతాయి!
భూమి కాస్తా కంపించడమైతే
ఆకాశ హర్మ్యాలు కూడ కూలిపోతాయి!



- డా॥వడ్డేపల్లి కృష్ణ
సెల్: 9246541699

పుస్తక సమీక్ష

# వినండి శ్రావ్య మాట..సంతసముగ...




పిల్లల్లో దాగి ఉన్న అంతర్గత శక్తులను బయటకు రప్పించి విద్యార్థులలో సృజనాత్మక శక్తిని పెంపొందించే ఉపాధ్యాయులకు నిలువెత్తు సాక్ష్యంలా నిలుస్తాడు గుండ్ల రాజు. వీరు సిద్ధిపేట జిల్లాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిన్నకోడూరులో భాషోపాధ్యాయులుగా పనిచేస్తూ విద్యార్థులలో భాషపట్ల మక్కువను పెంపొందిస్తున్నారు. వీరి శిక్షణలో చిరంజీవి పిట్ల కావ్య **"కావ్యమాల శతకం"** తదుపరి అదే పాఠశాల నుండి బండోజ శ్రావ్య రాసిన శ్రావ్య శతకం వెలువడడం భాషోపాధ్యాయులుగా వారు చేస్తున్న కృషికి నిదర్శనం.


బండోజు శ్రావ్య 10వ తరగతి చదువుతున్న సమయంలోనే పద్యాలు రాయడం మొదలుపెట్టి శ్రావ్య శతకం పేర ఒక శతకాన్ని మన ముందుంచిన బాల సాహితీ మూర్తికి ముందుగా అభినందనలు. శ్రావ్య రాసిన ఆటవెలది, సీస పద్యాలు **"కరుణించి కాపాడు భద్రకాళి", "అక్షర కాంతులు" ,"అమృతవర్షిని" ,"ఆకుపచ్చని ఆశలతో"** తదితర పుస్తకాలలో ప్రచురించబడడం అభినందనీయం.

**"శ్రావ్య మాట వినుము సంతసముగ"** మకుటంతో విభిన్న అంశాలపై 103 పద్యాలతో శ్రావ్య శతకం మన ముందు ఉంచారు. ఈ శతకంలో జన్మనిచ్చిన తల్లిదండ్రులు, చదువు నేర్పిన గురువులు ,ఆశీర్వదించిన దైవాలతో పాటు అనేక సామాజిక సమస్యలను స్పృశించారు. ఆధ్యాత్మిక అంశాలను వివరించారు. నేటి మానవులకు అవసరమైన సందేశాల్ని వినిపించారు. ఒకే అంశంపై కొన్నిచోట్ల రెండు మూడు పద్యాలు మనకు కనిపిస్తాయి.

సృజన కారుడు తన సృజనలో ఏదో ఒకచోట తల్లిదండ్రులను తప్పనిసరిగా స్మరించుకుంటాడు. అదేవిధంగా శ్రావ్య ,తల్లిదండ్రులను గురించి **"కన్నవారి ప్రేమ కలకాలముండురా"**యని తెలుపుతూనే తల్లిదండ్రులను గొప్పగా చూసుకోవాలి, ప్రేమగా చూసుకోవాలి అన్న సందేశాన్ని తన పద్యాలలో చూపించారు. అంతేకాదు అమ్మ ఘనత చెప్పనక్షరములు లేవని తెలిపింది. అమ్మని గురించి చెప్పడానికి నిజానికి అక్షరాలు చాలవు,పదాలు సరిపోవు.వాక్యాలు తూచలేవు.

ఆడపిల్ల పుట్టిందని చిన్న చూపు చూసే ఈ కాలంలో ఆడపిల్లని లక్ష్మియని వివరిస్తూ ఆడబిడ్డ లేని ఐశ్వర్యం ఎందుకని ప్రశ్నించింది. ఆడపిల్ల అంటే అదృష్టలక్ష్మిగా భావించాలని బోధించింది.



ప్రతులకు:గుండ్ల రాజు,
సిద్దిపేట
9885257050,
9490552263

గతాన్ని గురించి బాధపడుతూ కొందరు ,భవిష్యత్తు గురించి ఆలోచిస్తూ మరికొందరు ప్రస్తుతాన్ని నరకప్రాయం చేసుకుంటారు. అది సమంజసం కాదని వర్తమానాన్ని దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని యువతకు సందేశం ఇచ్చింది.

**"సెల్లు ఫోను వచ్చి జిందగీనే మార్చే / వింత మనుషులైరి విదితముగను/ బంధములను బాపి బతుకు నాగము చేసే"** అంటూ చరవాణి నేటి సమాజంలో మనుషుల మధ్య బంధాలని ఎలా చిన్నాభిన్నం చేసిందో చక్కని పద్యంలో వివరించింది.

**"ధనము స్థిరముగాదు తనువు స్థిరము కాదు/సిరిని చూసి నీవు మురవబోకు/ ఒంటరిగను వచ్చి వొంటరై పోదువు"** ఈ లోకంలోకి ఒంటరిగా వస్తాము తిరిగి ఒంటరిగా వెళ్తాము. ఈ మధ్యకాలంలో లేనిపోని ఆశలు ,ద్వేషాలు సంపాదనకై మోసాలు . ఇవన్నీ వ్యర్థమని చక్కని తాత్వికతతో కూడిన పద్యం.

మానవులకు అన్నింటికన్నా గొప్పనైన శత్రువు కోపం..కోపం వలన నష్టమే తప్ప మరేమీ ఉండదు. అందుకే **"కోపమిడిచి చూడు గొప్ప నుండు/ కోపగుణము నీదు కొంపనే ముంచురా"** యని గొప్ప మాటని పద్యంలో చక్కగా పొందుపరిచింది.

త్యాగాలకు నిలయం ఉపకారానికి ఆలయం తరువు. అందుకే **"చెట్టు నాటు నీవు చేరువై ఫలమిచ్చు/ చేరదీయు నిన్ను చివరి వరకు/ తల్లివోలె నిన్ను ధరణిలో కాపాడు"** అని చెట్టు మనిషికి ఎంతలా ఉపయోగపడుతుందో ఒక్క మాటలో తెలిపింది. వృక్షాన్ని తల్లితో పోలుస్తూ చెప్పడం బాగుంది.

మనిషికి ఆశ ఉండాలి.కానీ అత్యాశ పనికిరాదు.అత్యాశపడిన బ్రాహ్మణుడు ముసలి పులికి ఆహారమైన విషయం మానందరికి తెలిసిన విషయమే కదా.. అంతులేని యాశ నగ్గిపాలు/ ఆశ యుండవచ్చు నత్యాస వీడరా అని చక్కనైన సుభాషితాన్ని మనకందించింది .

మాటలు మనసులను కలుపుతాయి, మనుషులను విడదీస్తాయి.మాటకున్న శక్తి చాలా గొప్పనైనది. మంచి మాట తోడ మనసు గెలవవచ్చని ,మంచి మాటలకున్న మహిమను మనం ఎప్పుడూ మరవద్దని పద్యంలో సున్నితంగా సూచించినా అది సత్యమన్న విషయాన్ని మనం మరవకూడదన్న అంతర్లీనమైన అర్థాన్ని మనం గ్రహించాలి .

చదువు గురించి, పల్లె గురించి, రైతు గురించి, నీటి గురించి, చెద్దవారితో స్నేహం గురించి, ముప్పు తెస్తున్న ప్లాస్టిక్ వాడకం గురించి ,బ్రతకమ్మ పండుగ, దసరా పండుగ గురించి, యువతని పిచ్చివాళ్ళని చేస్తున్న ఆన్లైన్ పబ్జి గేమ్ గురించి, ఇంటికి దీపమైన ఇల్లాలు గురించి ..ఇంకా అనేక అంశాలను తీసుకొని చదువుకునే వయసులోనే చక్కని వైవిధ్యభరితమైన శ్రావ్య శతకాన్ని అందించిన బండోజు శ్రావ్యని అభినందించి తీరాలి.

**కం.అల్లరి చేసే వయసున**
**యెల్లలు దాటే కవిత్వ హేమమునొసగెన్**
**వెల్లివిరయవలె శ్రావ్యే**
**మొల్లగ సాహితి పరిమళ మోదము పెంచన్**

జిల్లా పరిషద్ ఉన్నత పాఠశాల హవేలి ఘనపూర్ లో భాషోపాధ్యాయులుగా పనిచేస్తున్న నల్ల అశోక్ గారన్నట్లు శ్రావ్య మరిన్ని కావ్యాలను రచిస్తూ సాహిత్యంలో స్థిరమైన స్థానాన్ని సంపాదిం చుకోవాలని ఆశిద్దాం.



- వైరాగ్యం ప్రభాకర్
90145 59059

## ఏమైనా చేస్తాడు

వాడు
ఆకాశం మీద పడుకుని
భూమిని కలగంటాడు
మేఘం పరుపుమీద
వెన్నెల దుప్పటి కప్పుకుని
రాత్రంతంతా పొర్లుతాడు
ఒక చుక్కని దొరకబుచ్చుకుని
పిట్టలా ఎగరేస్తాడు

కాలంతో స్నానం చేసి
అలల నురగలా
తళుక్కున మెరుస్తాడు
నదిలా జీవం ఒంపుకుని
చైతన్యమై ప్రవహిస్తాడు.

రెండు వెలుతురు కాగడాలు
కళ్ళల్లోకి ఒంపుకుని
లోకమంతా ప్రసరిస్తాడు

చీకటి రాజ్యంలో
దీప స్థంభంలా ప్రకాశిస్తాడు.

అడవి కదా
ఊరుకోడు
కార్చిచ్చులా కమ్ముకుని
జనారణ్య ప్రక్షాళనకు
కలాన్ని కరవాలం చేస్తాడు.

కళ్ళులేని సమాజానికి
చూపును యిస్తు
కుళ్ళుతున్న వ్యవస్థను
తూర్పారబట్టు
తానే ఒక నాయకుడిలా
దిక్సూచి అవుతాడు.
కవిగదా
ఏమైనా చేస్తాడు!



-రమణ వెలమకన్ని
సెల్:9866015040

# బడిబాట కార్యక్రమం ఆశించిన ఫలితాలు సాధించేనా...!

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా బడి బాట కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతుంది. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా విద్యాశాఖ రూపొందించిన బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉపాధ్యయనీయులు పాల్గొని ప్రతి ఇంటి ఇంటికి వెళ్లి బడికి వెళ్లె పిల్లల సంఖ్య తెలుసుకుంటూ స్కూల్ కు వెళ్లని పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ బాల కార్మిక నిర్మూలనకై కృషి చేస్తున్నారు. రోజు జిల్లాలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు అవగాహన ర్యాలీని అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. టీచర్లు గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపాలని కోరుతున్నారు. సర్కార్ పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10 వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంలో విద్యా బోధన, విశాలమైన తరగతి గదులు, ఆట స్థలం, డిజిటల్ స్మార్ట్ బోర్డ్ , నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నామని వారి తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం జూన్ 19 వరకు కొనసాగింది. ఈ బడిబాటలో భాగంగా ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్యను పెంచడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది కానీ ఇది ఎంత వరకు అమలు అవుతుందో వేచి చూడాలి. పిల్లలు ప్రభుత్వ స్కూళ్లలో చదివితే వచ్చే విద్యా, ఆపై అవకాశాలపై తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరించబోతున్నారు కానీ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉత్తీర్ణత సాధించలేక పోతున్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం జూన్ 12న స్కూళ్లను పునర్ ప్రారంభించారు.

ఈ కార్యక్రమానికి సరికొత్త విధానం అమలు చేస్తున్నారు. అధికారులు గత ప్రభుత్వం కూడా ప్రభుత్వ బడుల బలోపేతానికి విశేషమైన కృషి చేసింది ప్రస్తుత గవర్నమెంట్ గతం కన్నా మెరుగు పని చేస్తుందని చెప్పుచున్న ఫలితాలు ఎలా ఉంటాయని ముందు ముందు చూడవచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వం బడి బాట ప్రచారాన్ని అమ్మ కమిటీలకే బాగోగులు, బాధ్యతలను అప్పగించారు. ప్రైవేటు మోజు నుంచి తల్లిదండ్రుల్లో మార్పు తెచ్చే ప్రయత్నం చేయనున్నారు సంబంధింత అధికారులు. బడి బాట కార్యక్రమంలో అనేక అంశాలను అధికారులు ప్రచారం చేయనున్నారు

అవి ఏమిటంటే ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తీసుకురావడం, విద్యార్థుల నమోదు శాతం పెంచటం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం బడిబాట కార్యక్రమం నిర్వహిస్తుంది. ఈసారి ప్రభుత్వం వినూత్నంగా ప్రచారం ప్రారంభించింది కానీ ఎంత వరకు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను జాయిన్ చేస్తారన్నది చర్చ. గవర్నమెంట్ బడులలో నాణ్యమైన విద్యను పిల్లలకు అందించాలని తల్లిదండ్రులను చైతన్యవంతులను చేస్తుంది ప్రభుత్వం. ప్రైవేటు స్కూల్స్ లో చేరితే రూ.50 వేల నుంచి రూ 1.50 లక్షల వరకు ఖర్చవుతుందని, ఇప్పుడు ఆదా చేసే డబ్బును మీ పిల్లల ఉన్నత చదువులకు పొదుపు చేయమంటూ సరికొత్తగా ప్రచారం చేపట్టింది.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది కానీ దాంట్లో ఎంత వరకు విజయం సాధిస్తుందో చూడాలి. ప్రైవేటుపై మోజు తగ్గించేందుకు గతంలో ఎన్నడూ లేని విధంగా తల్లిదండ్రుల్లో మార్పు తీసుకురావాలని ప్రయత్నాలు ప్రారంభించింది. రాష్ట్రమంతటా ప్రతి పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసింది. వీటి అధ్వర్యంలో అన్ని పాఠశాలలను కొత్త హంగులతో తీర్చిదిద్దుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్, తెలుగు మీడియంలో విద్యాబోధనతోపాటు విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం అందిస్తోంది. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఒక జత షూస్‌ను ఉచితంగా అందిస్తోంది ప్రభుత్వం. బడి ఈడు పిల్లలను, బడిమానేసిన విద్యారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు అమ్మ ఆదర్శ కమిటీలతోపాటు, విద్యా శాఖాధికారులు, హెడ్మాస్టర్లు, యువజన సంఘాలు, ప్రజా ప్రతినిధులు ఇందులో పాల్గొంటారు. ఇదే బడిబాట సందర్భంగా ప్రైవేటు స్కూళ్లపై మోజు తగ్గించి ప్రభుత్వ పాఠశాలల పునర్వ వైభవానికి కృషి చేసేలా విస్తృత ప్రచారం చేపట్టాలని, తల్లిదండ్రుల్లో మార్పు తెచ్చేందుకు ప్రయత్నం జరగాలని ముఖ్యమంత్రి విద్యాశాఖ అధికారులకు, జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. పాఠశాలల బాగోగులు, బాధ్యతలను అమ్మ కమిటీలకు అప్పగించిన ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరంలో ఆశించిన స్థాయిలో విద్యార్థుల నమోదు శాతం పెరిగి ఆశించిన ఫలితాలు వస్తాయని ప్రభుత్వం భావిస్తుంది. రాష్ట్రంలో మొత్తం 26,823 పాఠశాలలను గుర్తించింది. 20,680 చోట్ల ఇప్పటికే అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను ఏర్పాటు చేశారని సమాచారం. 17,729 పాఠశాలల్లో అవసరమైన పనులన్నీ ఈ కమిటీలకు అప్పగించారు. పాఠశాలల్లో తలుపులు, కిటికీలు, బ్లాక్ బోర్డులు, ఎలక్ట్రిక్ స్విచ్ బోర్డులు, ఫ్యాన్లు, మరుగుదొడ్ల తాత్కాలిక మరమ్మతుల పనులన్నింటినీ ప్రభుత్వం పాఠశాల పునర్ ప్రారంభానికి ముందే మొదలు పెట్టింది. ఈ పనులకు రూ.667.25 కోట్లు కేటాయిం చింది. అందులో ఇప్పటికే రూ.147 కోట్లు కమిటీ లకు అడ్వాన్సుగా కూడా చెల్లించిందని సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. ప్రభుత్వం చేస్తున్న హడావుడి మంచిదే కానీ ఎంత వరకు అనుకున్న లక్ష్యాలు నెరవేరుస్తుందని అందరు ఎదురు చూస్తున్న తరుణం. ప్రభుత్వానికి సంపూర్ణ అక్షరాస్యతను తీసుకు రావడం ఒక సవాలుగా మారనుంది కేంద్ర, స్వచ్ఛంద సంస్థలు బాల కార్మికులు నిర్మూలకై పోరాడుతున్న పూర్తి స్థాయిలో బాల కార్మికులను గుర్తించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమౌతు న్నాయి. అదే విధంగా ప్రైవేటు స్కూల్ లలో ఫీజులను నియంత్రించ లేక పోతున్నాయి. దీంతో చదువు వ్యాపారంగా మారింది. పేద విద్యార్థులకు నాణ్యమైన చదువు అందలేక పోతుంది. ఐఐటీ, సీబీఎస్, ఎస్ ఎస్ సీ, వంటి సిలబస్ లు ప్రభుత్వ పాఠశాలలో పెడితే బాగుంటుందని విద్యార్థులు అభిప్రాయ పడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న బడి బాట కార్యక్రమం ఎంతవరకు విజయవంతం కానుందో వేచి చూడాలి.



-మిద్దె సురేష్, 9701209355

నాటి తరం వారి కథలు నేటి తరానికి

**కథల వంతెన**

# సెలిమె

కథ



-జాజుల గౌరీ
8519923199

పడమట సూరీడు ఆత్రంగా అమ్మ వడిలకు వదిగి పోతున్నయాల, చుట్టు సందె చీకట్లు అలుముకుంటున్నయాల, కువ కువ మంటు పిట్టలు రయ్యి రయ్యిన ఎగిరిపోతూ గూళ్ళకు తిరుగు ముఖం పడ్తున్నయాల. పొలాలల్ల కూలీనాలి చేసి అలసి సొలసి పాత చింపుల కుంచె గొంగళ్ళ మాటున సలికాచుకుంట యిండ్లకు తిరిగి పోతున్నప్పుడు మాదిగ వాడల కెళ్ళె ఒక గుంపు ఊరు మొఖానికి వస్తా వుంది. ఆ గుంపు చంద్రమ్మను నడుమ పెట్టుకుని మౌనంగా కదిలి వస్తా ఏదో బాధను తవ్వి పోసుకుంట తవ్వి పోసుకుంట నడుస్తా వుంది.

పొలాలల్ల కెళ్ళి తిరిగొస్తున్నోళ్లు పక్క పక్కగా జరిగిపోతా రాళ్ళ లెక్కన నిలవడి, ఆ గుంపును సూస్తా మోకాన కొంగును పెట్టుకుని గుడ్ల నీళ్ళు కుక్కుకోవట్టింద్రు.

యింకొందరికి దుఃఖం తోటి కుతికలు ముడివడి ఏం మాట్లాడ లేక రెండు సేతులను చెంపలకు ఆనించి "హా... భగవంతా ఏమి రాత రాస్తివిరా!" అంట చంద్రమ్మను చూస్తుండగానే ఆ గుంపు ముందు నుండి కదిలిపోతావుంటే రస్తల అడ్డంవచ్చినోళ్ళు పక్కకు పక్కకు జరిగి నిలవడవట్టింద్రు.

యింగ ఊళ్లెకుపోనికి పదంగల దూరం ఉండంగానే రాజమ్మ పెద్ద పెద్ద అంగలేస్త నడిసొచ్చి "నా యమ్మ.. ఓ యమ్మ.. నా బిడ్డే నీకెంత కష్టమొచ్చెనే" అంట చంద్రమ్మను గుండెకు అదుముకుంట "ఏమి రాత రాసిండే దేవుడు...." అంట ఒక్క పెట్టున ఏడ్చే తాల్లకు మేనత్త చేతిల గువ్వలెక్క వదిగిన చంద్రమ్మ దుఃఖం ఉప్పెన లెక్క ఎగసెగసి పడింది. గది సూసి సుట్టు ఉన్నోళ్ళ శోకం కట్టలు తెగింది.

నడితోవలనే ఒకలను పట్టుకుని ఒకలు ఏడుస్తా ఉంటే.. అంతట్లనే మొగోళ్ళు ముందట తేరుకొని "ఆ... పాండ్రి పాండిరా! సీకటాళ్ళయింది జెల్దీ సేదు ఇడ్పించుకొని రావాలే జెల్ది నడువుండి" అంట ముందుకు కదులుతుంటే గా గుంపులకెళ్ళి చంద్రమ్మ చిన్నత్త తేరుకొని "ఓ రాజమ్మ పిల్లను పట్టుకుని గట్లేడుస్తవేందిరా! నువ్వే గట్లేడుస్తే పిల్ల పుట్టెడు దుఃఖంల వుండి యింకెట్ల ఏడ్వాలె" అంట ఆమెను పక్కకు ఇడదీసి చంద్రమ్మను దగ్గరకు తీసుకుంట గదువ కింద ఒక చెయ్యి ఉంచి రెండో సేతితో కండ్ల నీళ్లు తుడుస్త "వూకో.. వూకో.. నాయమ్మ నాయమ్మ వూకో బిడ్డ. నీకు వచ్చిన కష్టం తక్వదా సెప్పు జర ఓర్చుకో కొడుకా" అంట పొదివి పట్టుకుని ముందుకు దారితీసింది. గుంపు గుంపంతా కల్లు కంపోనుకు పోయేతాళ్ళకు కల్లు కంపోను జనంతోటి కిటకిట లాడవట్టింది.

ఆ గుంపు ఓ మూల జాగ చూసుకుని నిలవడే తాళ్ళకు వంశపోల్లంతా ఒక్క తాన వరుసగా కూకుంద్రు. వెంట వచ్చినోళ్లు తలా ఒక కల్లు సీసా తీసుక్కుని అందరి సేతులల్ల కొంచెం కొంచెం కల్లు పోస్త మిగిలిన కల్లు సీసాలను చెంద్రమ్మ ముందువుంచి పక్కకు జరుగ వట్టింద్రు. సేదు ఇడిపించనీకి అరిచేతుల పోస్త పోతుంటే దాన్ని నోట్ల పోసుకుని నీళ్ళ పుక్కిలించినట్లు పుక్కిలించి ఉంచేయ సాగింద్రు. చివరాకరికి మిగిలిన కల్లు సీసాను చంద్రమ్మ ముందుంచి వంశపోల్లందరికి తలా ఒక సీసా పంచి అందరు అది తాగంగనే సట్టున లేసి యింటి ముఖం పట్టింద్రు.

అప్పటికి పూరగా సీకటి అలుముకుని సుట్టుపక్కల కెళ్ళి కీచురాళ్ళ రొదతోటి కప్పల బెకబెకలు కలగలసి పోతుంటే దూరంగా కుక్కలు ఉండుండి అరుస్తున్నయి. రస్తల అందరు భారంగా నడిచిపోతుంద్రు. చంద్రమ్మ సూపంతా పొలాల దిక్కుపోయే రస్తెంటనే ఉంది. చుట్టంతా కారు సీకటి అయినా ఎండి ఎలుగోలె పసిబిడ్డ నెత్తుకుని పొలం దిక్కు నడిసి పోతున్న యాది తలంపుకొచ్చి ఎర్రి సూపులు చూస్తుంటే కడుపుల కర్ర సుండి దేవినట్లయి కడుపుకోత యాతన పెడ్తుంటే దుఃఖం ఎగదన్నుకొచ్చి "హ..ఆ...ఆ..." అంట ఒక్క పెట్టున ఏడుస్తా ఏడుస్తా నా బిడ్డా...... బిడ్డా... అంట ఓసిలు తప్పి కుప్ప కూలింది.

అందరూ తేరుకొని నలుగురు కలిసి చంద్రమ్మను చేతులల్లోకి తీసుకుని లేవదీస్తుం డగనే మొగులయ్య సటుక్కున భార్యను భుజం మీదేసుకుని జెల్ది జెల్ది యింటి దిక్కు నడుస్తుంటే చుట్టాలంతా గుంపు గుంపుగా ఎన్కపడిఆత్రంగా ఇంటి దిక్కు ఉర్కెతాల్లకు సాయిబాన్ల, పీట మీదేసి ఆమె ముఖం మీద సల్లటి నీళ్లు చల్లే సరికి మెల్లగా కదలిక సురువై" నా బిడ్డ...' నా... బిడ్డ" అంట భారంగానే కండ్లు తెరిచినట్లనే తెరిచి మల్ల గుడ్లు తేలేసింది.

బిడ్డ కయాలు తప్పుడు చూసిన ఎల్లమ్మ "నాయమ్మ నాయమ్మ... నీకు ఎంత కష్టమొచ్చెనే నా తల్లి..." అంట శోకాలు పెడ్తుంటే, "ఏ ఊకో ఎల్లక్క ఊకో నువ్వే గిట్లేడుస్తే ఆ పిల్ల యింకా గుండేపగులుతది" అంట లచ్చువ్వ అనంగనే ఆమె ముఖానికి కొంగు అడ్డం పెట్టుకుని లోపల లోపలే కుమిలి కుమిలి ఏడ్వసాగింది. అందరి గుండెలు భారంతోటి బరువెక్కి ఎక్కడోళ్లక్కడనే బేజారుగా పంచల పొంటి కూర్చొని పచ్చి మంచినీళ్లు ముట్టలే చెట్ల మీదున్న పిచ్చుకలు నిద్రలోకి జారుకుంటుంటే గపుడే మేల్కొన్న గుడ్లగూబలు ఉండుండి "గుర్రుర్.... గుర్రుర్" మంట అరుస్తున్న యాల పసిపిల్ల పేరు మీద దీపం పెట్టి పాలు పోసిండు.

నడిజాము దాటుతుండగా చంద్రమ్మ కయాలుకొచ్చి నెత్తి తిప్పి అటు ఇటు సూసేతాళ్ళకు ఏడోళ్ళు ఆడనే కూసొనే కురుపట్లు పడుండు చూసి మొగని దిక్కెల్లి సూసింది. దూరంగా పంచకు చేరగిలబడి నెత్తికి చేయి ఆనించి సీకట్లకు చూస్తుండు. గది చూడంగనే గుండె యింకింత చెరువై కండ్లల్ల కెళ్లి దుఃఖం పొంగుకు రాంగనే కన్నీళ్ళు కాల్వలలెక్కె పోతా పోతా గుండె తలుపులు బళ్లున తెరుచుకుని యాదేంట ఉర్కినయి.

ఆయల్ల.........ఆయల్ల....

తొలి కాన్పయి తల్లిగారింటి నుండి అత్తగారింటికి వస్తున్న చంద్రమ్మ తొలిచూలు బిడ్డనెత్తుకుని నిండు పున్నమి లెక్కుంది. పలుగురాళ్ళతోటి తొవ్వగుడిపి తంగేడి పూలేస్తా బిడ్డను సంటి పిల్లతోటి పలుగు రాళ్ళమీద నుంచి దాటిస్తా. "పైలము బిడ్డ సంటి పిల్లను మంచిగ చూసుకో, మందగల్ల ఇల్లు మీది ఏ పని సెయ్యకున్నా మాటలొస్తాయి కొడుకా.. గట్లనే నీళ్లల్ల ఎక్వ నానకు పిల్లకు మొగులొస్తాయి, ఒక యాడాది దాక సంటిదాన్ని భద్రంగా సూసుకో, నడుమ నడుమ నేను నాయిన వస్తనే వుంటం తమ్ముడ్ని గూడ పంపుత తియ్యి బిడ్డా..." అంట బిడ్డకు ఆమాట ఈ మాట చెప్తునే "యింకా రెండు నెలలు ఉంచమంటే అప్పుడే తీస్కపోవడ్తివి జెర పిల్లలు పయిలం వొదినా..." అంట బిడ్డను అప్పజెప్పి బస్సెక్కించి పంపిస్తా... తోవ కనుమరుగయే దాకా అంగలారుస్తుంటే ఎల్లమ్మ గుండె బరువెక్కింది.

గప్పటికి సెంద్రమ్మ అత్తగారింటికి వచ్చి నెలైంది. కాన్పయి వెళ్లిన కాణ్నించి ఊకే పిల్లను సూసుకుంట కూకుంటే యింట్ల ఏమనుకుంటరోనని సంటి పిల్లను సూసుకుంట సూసుకుంటనే యింట్ల ఆ పని ఈ పని సగవెట్టవట్టింది.

సిట్ట సిట్ట దినాలు గడుస్తున్నయి.. సంటి పిల్ల బోర్లపడి నడింట్ల సందమామోలే పారాడ వట్టింది. బిడ్డను సూసి మొగులయ్య మస్తు మురిసిండు.

"ఎద్దు ఎవుసం గల యిల్లు పిల్ల యింట్లనే కూకుంటే పనెట్లయితది చెప్పు" అంట అత్త సనుగుడు సురువు చేసే సరికి చెంద్రమ్మ యింట్ల పనులు చేసుకుంటనే, పిల్లను ఓ కంట కనిపెట్టుకుంట మిగతా టయిముల పొలం కాడికి గూడా పోయి సెట్టు కింద పిల్లనేసి పొలం పన్లు చేస్తా ఓ కన్ను పని పిల్ల దిక్కు ఎయ్యవట్టింది. ఒకనాడు పొద్దుగాల్లనే కలేగూర గంపనెత్తుకుంట... "ఓ పిల్లా నేను కూరలమ్మ

> **"చెప్పుకుంటే ఎట్ల బిడ్డా... గింత జెల్ది పన్లకి దిగితే పిల్లకు సర్దయి మొగుల్లొస్తయి జర భద్రం బిడ్డా..."**

పోతున్నగాని జెర బిరాన పని చేసుకుని పొలం కాడికి పోయి పాలకూర తెంపు, రేపు మనూర్లనే అంగడి ఉంది.. జెల్ది పోవాలె..." అంట అత్త చెప్తున్న మాటలు యింట్ల పనిచేస్తున్న చంద్రమ్మ చెవిలపడి గింగురులు తిరుగుతున్నయి.

పదకొండాలకల్ల బిరానా పన్లు ముగించుకుని పిల్లను సంకనేసుకుని పొలం కాడికి పోయేతాళ్లకు ఎండకు పాలకూర నిగనిగ లాడవట్టింది.

పొలం కాడున్న గడ్డాముల చింత సెట్టుకింద మంచి దాపు చూసి పిల్లను పొత్తిల్లల్లో వేసి పాలకూర మడిలకు పోయి పాలకూర కోసి కట్టలు కట్టుకుంటా గడ్డాము దిక్కు మనసు మర్లుతుంటే బిడ్డకు వినిపించేటట్టుగా పాటందుకుంది.

**"లాలి లాలి జోలాలి**
**ఓ ఓ హాయి**
**కండ్ల నీళ్ళా నా తల్లి**
**ఓ ఓ హాయి**
**నిన్ను యిడిసే యాలల్ల ఓ.. ఓ.. హాయి**
**ఎక్కి ఏడ్చే నా తల్లి ఓ ఓ హాయి**
**నాయిన వస్తే నా తల్లి ఓ ఓ హాయి**
**పండు తెస్తడు నా తల్లి ఓ ఓ హాయి**
**నాయినొచ్చే దాకైనా ఓ ఓ హాయి**
**పండుకోరా నా కొండ ఓ ఓ హాయి ॥లాలి॥**

**నేను లేని యాలల్ల ఓ ఓ హాయి**
**చెట్టుకొమ్మే అమ్మాయే ఓ ఓ హాయి**
**ఊయలూగే యాలల్ల ఓ ఓ హాయి**
**నా యాదే నీ లాలాంట ఓ ఓ హాయి॥లాలి॥**

**మడులల్ల నేనుంటే ఓ ఓ హాయి**
**సెట్టు దిక్కే నా పానం ఓ ఓ హాయి**
**నిన్ను మరువ నా సెండు ఓ ఓ హాయి**
**నన్ను ఇడ్వ నా పండు ఓ ఓ హాయి॥లాలి॥**

**సెట్టు పట్టు తేనిచ్చే ఓ ఓ హాయి**
**పట్టు కొమ్మ పూలిచ్చే ఓ ఓ హాయి**
**వెన్నెలల్లే మెరిసేవు ఓ ఓ హాయి**
**సందమామల్లె నవ్వేవు ఓ ఓ హాయి॥లాలి॥**

**సక్కనమ్మ నా తల్లి ఓ ఓ హాయి**
**నిద్రపోరా నా కన్నా ఓ ఓ హాయి**
**ఊయలూగు నా తల్లి ఓ ఓ హాయి**
**కంటి నిండా బజ్జోరా ఓ... ఓ... హాయి ॥లాలి॥**

అట్ల దినాలు గడుస్తున్నాయి.

ఒకనాడు ఎల్లమ్మ బిడ్డను పండుగకు తీసుకుపోదామని వచ్చే తాళ్లకు చంద్రమ్మ పొలం కాడుందని ఎర్కయి పొలం కాడికి బిర బిరా పోతుంటే తోవల గడ్డాము కాడ చెట్టు కింద మనుమరాలు ఉంగ.. ఉంగ.. అంట బోర్లపడి మన్ను పెడ్డలతోటి అడుకునుడు సూసి ఆమె మనసు మస్తు రంజి వడ్తుంటే సంటి బిడ్డను సటుక్కున ఎత్తుకునే సరికి ఆవును చూసిన లేగ లెక్క సంటి పిల్ల ఏడుపందుకుంది. ముక్కుల కెల్లి కారుతున్న సీముదునున నోట్ల కెలి కారుతున్న జొల్లునంతా కొంగుతోటి తుడుస్త" నా అమ్మనే..... ఊకో బిడ్డ.. ఊకో.. అని గుండెలకు అదుముకుంట బిడ్డ దిక్కెల్లి అటు ఇటు చూసింది. దూరంగా మడిల పాలకూర కోస్తా" బిడ్డ కన్పించేనరికి మనుమరాలిని భుజం మీదేసుకుని అటు పోతనే "ఓ చెంద్రమ్మ ఏంది బిడ్డ పిల్లను గిట్ల వంటరిగిడిసి ఏందిరా.. ఆపని..." అంటుంటే పాలకూర కోసుడు ఆపి చేతులు దులుపు కుంట తల్లి కాడికి బిర బిరా ఎదురొచ్చి 'బాగున్నవాయె' అంట నవ్వుతనే అడిగి సంటి పిల్లను తీసుకోంగనే "ఏంది బిడ్డ ఏంది ముత్యమంత పిల్లనేసుకుని గీ నర్దిల గీపనేందిరా..." అంట బిడ్డను రంజిగ అడిగింది.

"ఆ... మల్ల ఏం జెయ్యమంటవే ఇంట్ల ఎవలమన్నా ఉట్టిగున్నమా సెప్పు. ఎవల పనులు ఆళ్ళకున్నయి. మా అత్త తిరిగి తిరిగి కూరలమ్మి వచ్చే తాళ్లకు గీడ పచ్చకూరలు రడీగుండాలంటే యింట్ల పని అవంగనే పొలం కాడికి వచ్చి పాలకూర కోస్తున్న" అన్నది. "కూలోళ్ళను పెట్టుకోవచ్చు కదా" అన్నది.

"అమ్మ మా అత్తకు ఎట్ల చెప్తునే.." అన్నది భయంగా.

"చెప్పుకుంటే ఎట్ల బిడ్డా... గింత జెల్ది పన్లకి దిగితే పిల్లకు సర్దయి మొగుల్లొస్తయి జర భద్రం బిడ్డా..." అంట మనుమరాలిని దగ్గరకు తీసుకుని మురిపెంగా చూస్తా "అమ్మలు పండుగకు పోదాం యింటికి వస్తవామ్మ" అన్నది. తల్లి పండుగకు తీసుకుపోను వచ్చిందని చంద్రమ్మకు సమజయింది.

ఆ మాట ఈ మాట మాట్లాడుకుంట మంచి చెడ్డలు అర్సుకుని సేన్లకు కూర కట్ట పోయింది ఎల్లమ్మ. చంద్రమ్మ బిడ్డకు పాలిస్తా చెట్టు కింద సేదదీరింది.

పొద్దుగుంకి పోయేయాల్లకి కూరగాయల గంపతోటి వచ్చిన నర్సమ్మ వియ్యంకు రాలిని మడిల సూసి దగ్గరకు పోతనే "ఎప్పుడొచ్చనవు వొదినా, అన్న గిట్ల బాగున్నరా" అంట పలకరింపు విన్పించి వెనకకు మల్లి చూస్తా. "బాగున్నరొదినా, మీరెట్లున్నరు? అంతా మంచిగున్నరా? ఇయ్యాల పగటాళ్ళకల్లా యింటికొచ్చిన కానీ యింటికాడ ఎవలు లేరు యిగ పొలం కాడుంటరని తెలిసి ఇటొచ్చిన" అంటనే నర్సమ్మ ఈతనార చీరుతుంటే పాలకూర కట్టలు కడ్తనే "పిల్లను గింత జల్ది పన్లకు దించిన వొదినా" అన్నది బాధతోటి.

"ఏం జేద్దు పిల్లా ఊర్ల కూలోళ్ళు దొరుకతలేరు నేనా అంగట్ల అంతా అమ్మి వచ్చే తాల్లకు గింత యాళ్ళయితది గందుకనే" అని అనంగనే ఎల్లమ్మ మారు మాట్లాడక పాలకూర కట్టలు కట్టడంల మునిగింది.

పూరగా చీకటిపడే యాళ్ళకు అందరు యింటిముఖం పట్టింద్రందరు.

×××

మర్నాడు ముని మబ్బులనే లేసిన ఎల్లమ్మ యింటికి పోను తయారయి "పొలం కాడ మస్తు పనుంది మీ అత్త పండుగకు పంపనన్నది బిడ్డా పసి పిల్ల పయిలం జర భద్రంగ చూసుకో. నేను పోయొస్త" అంట పసిపిల్లనెత్తుకుని గుడ్లల్ల నీళ్ళు తెచ్చుకుంట కదిలి పోతున్న తల్లి రూపాన్ని కన్నీళ్ళ మసకచేశాయి చంద్రమ్మకు.

దినాలు గడుస్తున్న కొద్ది యింటి పని పొలం పనితో చంద్రమ్మకు వశమయితలే అట్లని ఊకే కూకుండ ఆమెకు మనసొప్పక ఎట్లనో ఒకట్ల పిల్లను సముదాయించుకుంటనే అన్ని పన్లు చేసుకోవట్టింది.

మొగులయ్య భార్య అవస్థను సూస్తనే వుండు కాని ఎద్దు ఎవుసం గళ్ళ యింట్ల ఎవలపని ఆళ్ళకు వుండి ఊపిరి సలపనిస్తలే.

యిటు యింట్ల అటు పొలం పని చేసేసరికి తల్లి సర్ది సంటి పిల్లకు తగిలి కుస్...కుస్... అనవట్టింది.

ఆడికి మొగులయ్య పొలం కాడికి భార్యను పంపొద్దని తల్లికి చెప్పిండు అది విన్న నర్సమ్మ "మల్ల పెండ్లాన్ని పొలంకు పంపొద్దని బాగానే చెప్తున్నవు కానీ కూలోళ్ళను పెట్టి పొలం పనులు సేపియ్య రాదు" అంటూ కోపంగంటుంటే తల్లి ముందల గుటికెలు మింగిండు.

అందరి సేండ్లల్ల పొలం పనులు మస్తు జోర్గ నడుస్తుంటే కూలోళ్ళు దొరుకుడు కష్టం గుంది గట్లకాక ఆళ్ళు ఎంత అడిగితే అంత ఇచ్చే స్తోమత లేదు.. అందుకే గమ్మునయిండు.

సలి కాలంకు తోడు తుఫాను పట్టి రెండు మూడు వాన జల్లులు పడ్డయి. ఊరు ఊరంతా తడిసి ముద్దయితుంటే.. పొలం పని తప్పినా చంద్రమ్మకు యింటి పని తప్పలే. వానలో నానుడు ఆ పని ఈ పని చేసుకునే తాళ్ళకు పసిపిల్లకు సలితోటి వొళ్ళు ఎచ్చవడి జ్వరం పట్టింది.

> **" అత్త కోడండ్లు సేతుల పిల్లనేసుకుని ఉరుకుల పరుగుల మీద ఉర్లకొచ్చే సరికి జనం గుమి గూడింద్రు"**

ఆరం దినాలు గట్లనే గడిసే తాళ్ళకు నర్సమ్మకు కాలుసేతులు ఆడలే పొలంల నీళు ్ళనిండి పాలకూర ఏడ కుళ్ళిపోతదో అని రంజి పడింది. కానీ నాలుగోనాడు గొరిచ్చింది. అందరు మల్ల పన్ల పడ్డరు. ఐదోనాడు చంద్రమ్మకు పొలం పనులల్ల దిగక తప్పలే. పొలం కాడికి పోయి గడ్డాముల బిడ్డకు ఎచ్చంగా పక్కపరిచి పాలు ఇయ్యపోతే పిల్ల సర్దితోనుండి సరిగి పాలు తాగలే పసిపిల్ల ముక్కులకెల్లి చీముడు కారుతుంటే కొంగుతోటి తుడిసి "ఏం బిడ్డా పాలు తాగుతలేవేందిరా" అంటుంటే సంటి పిల్ల నిదుర కండ్లతోటే సందమామోలే నవ్వింది.

బిడ్డకు అట్లనే గుండెలకు అదుముకుని నెత్తిమీద ముద్దు పెట్టుకుంట "జెర నిద్రపో బిడ్డ జెల్ది జెల్ది కూర కోసొస్త" అంట గడ్డాముల నిండుగ చీరగప్పి జోకొట్టె సరికి పసిపిల్ల నిద్రలకు జారుకుంది. "బిడ్డ సర్దితోటి మస్తు కుస్స కుస్స అయితంది. దబ దబ కూర కట్టి బిడ్డను తీసుకుని బిరాన యింటికి పోవాలె" అని మనసులో అనుకుంట పొలం కాడికి పోయి సట్ట సట్ట కూర కోస్తా కోస్తా పనిల మునిగింది.

ఎంత సేపయినా అటు సెట్టు కింద నుండి కూడా సంటి పిల్లసప్పుడు లేక పోయేతాళ్ళకు తిండి తినడం మాని ఆత్రంగా పనిల పడింది.

పగటాల దాటుతుండగా నర్సమ్మ సరాసరి కోడలి తానకు వచ్చి 'ఏం పిల్ల బువ్వ తింటివా.. బుడ్డ పిల్లకెట్లుంది' అనడుగుతుంటే తినలేదత్తమ్మ పిల్ల యింకా సుస్తిగానే ఉంది బిరాన పనిచేసుకుని పోదామని పనిలనే ఉన్న పిల్ల లేస్తే పోదామను కుంటి, కాని బుజ్జి యింకా లేసినట్లు లేదు" అంట గడ్డము దిక్కు చూస్తుంటే. "సరే తియ్యి యింటి కాడ కట్టలు కడ్తముగాని గంపల ఆకు కూరంతా ఎత్తు, పిల్లను తీసుకొస్తా"నంట నర్సమ్మ సెట్టుకాడికి పోతుంటే అటు దిక్కు తిరిగి చూస్తనే పచ్చ కూరనంతా ఎత్తి గంపలో మట్టంగా పేర్చసాగింది చంద్రమ్మ.

అంతతట్లనే గడ్డాము కాడికి చేరిన నర్సమ్మ చెట్టు కింద పసిపిల్లను చూస్తానే ఒక్క పెట్టున 'ఓయమ్మ' అంట కెవ్వున కేకేసి ఒర్లే తాళ్ళకు మడిల ఉన్న చంద్రమ్మ గుండె జల్లుమన్నది.

సేతులున్న పాలకూరను ఆడనే పడేసి అర్దుతగా గడ్డము కాడికి ఒక్క అంగలో ఉర్కింది. చెట్టు కింద బిడ్డను సూసేతాళ్ళకు మిఠాయి మీద ముసిరిన ఈగల లెక్క సలి సీమలు పసిబిడ్డ చుట్టు దట్టంగ ముసిరి వుండటం సూసి "నా బిడ్డ" అంట మీదకప్పి ఉన్న చీరను గుంజింది. కానీ అప్పటికే చీర లోపల తెట్టలు తెట్టలుగా చేరిన చీమలు మిఠాయిని తింటున్నట్లుగా పిల్లను కొరికి పెడుంటే చేతుల తోటి ఆత్రంగా దులపసాగింది. అంతట్లనే నర్సమ్మ యాప చెట్టుకాడికి ఉరికి యాపకొమ్మలను రపరప ఇరుసుకొచ్చి చీమలను పారదోలేసరికి అవి ఇద్దరి మీద కలబడ్డయి.

"ఓయమ్మ నా పిల్లను ఏం చేస్తయే" అంట ఏడ్చుకుంటనే యిద్దరు తలా ఒక దిక్కు దులిపేసరికి అవి బిల బిల మంటూ నలు దిక్కులకు సర్దుకుంట అడొచ్చిన యిద్దరిని కరువవట్టినయి. అయినా అత్త కోడలు తంటాలుపడి సలిసీమల గుంపుల కెల్లి పిల్లను పక్కకు గుంజింద్రు. అప్పటికే పసిపిల్ల ఓసిలు తప్పి యిదువసందు లేకుండా రక్తం ముద్దయి గుడ్లు తేలేసింది.

అత్త కోడండ్లు సేతుల పిల్లనేసుకుని ఉరుకుల పరుగుల మీద ఉర్లకొచ్చే సరికి జనం గుమి గూడింద్రు. ఆత్ర పడతా ఏ డాక్టరు కాడికి తీస్కపోయినా ఒక్క డాక్టరు కూడా చెయ్యి పట్టి చూడలే. అందరు కూడ పెద్ద దవఖానకు తీస్కపొమ్మని నీలవురి దవాఖానాకు రాసింద్రు.

అందరు గూడి ఆగమేఘాల మీద ఆ దవఖానకు పోతే ఎమర్జెన్సీల ఏసి గులుకోసు పెట్టింద్రు.

రెండు దినాలు కొన ఊపిరితో వున్న పసిపిల్ల మూడోనాడు ఊపిరి ఆపేసి కడుపుకోత మిగిల్చింది.

యాదినంతా నెమరేస్తూ ఎక్కెక్కి ఏడుస్తున్న భార్య దగ్గరకొచ్చిన మొగులయ్య నెత్తి మీద చెయ్యి వెయ్యంగానే రెండు చేతుల తోటి ఆ చెయ్యి పట్టుకుని సెలిమలెక్క మారుతున్న ఆమె దుఃఖంతో ఊరు ఊరంతా బళ్ళున తెల్లారి కన్నీటి సెలయేరయింది.

## దేహాకాశం

చుక్కల్ని వేటితోనూ లెక్కించలేం
చంద్రుడి వెన్నెల్ని ఏ త్రాసుతోనూ
తూచలేం
చంద్రుడ్ని చూసిన నగ్న కళ్లతో
సూరీడుని తేరిపార చూడలేం
కిరణాల్ని అసలే లెక్కించలేం
చూపు ఎంత దూరం ప్రాకినా
మనం
సాకే పసిపాపల్లా
మన కన్నులు ఇక్కడే
మన వద్దనే
మన లోపలి ఆకాశంలో
కనిపించకుండా దాగుండేది
చంద్రుడో మరి సూర్యుడో!



-మాధవి సనారా
సెల్: 8639491246


## గులాబి

ఎన్ని రోజులు
ఎన్ని రాత్రుళ్ళు
నన్ను నేను మత్తులో
ముంచేసుకొన్నానో!
ఎన్ని మోసగించిన సమయాలు
నాకు తెలియకుండానే
నలిగి
తల వాల్చేసిన సందర్భాలు!
ఎన్ని కన్నీళ్లు,
ఎంత నిస్సహాయత!
ఎన్నిసార్లు
మరణించి జీవించానో!
నిద్ర పోతుందో కుమిలి పోతుందో
తెలియని శ్రీమతి గుండెల్లోకి
ఎన్నిసార్లు రక్తాన్ని చిమ్మానో!
బ్రతుకు రంగుకి
రక్తాన్ని పులిమి
మనసుతో కలబడి
పోట్లాడిన ఉదయాలెన్నో!
ఇప్పుడు గులాబీలతో
అలంకరించిన జీవితం
నేను ఛేదింపలేకపోతున్న
రహస్యమే!



-ఏటూరి నాగేంద్రరావు
7416665323

## ప్రేమ ఒక విశ్వజనీన సూత్రం




- డా॥ కత్తి పద్మారావు
9849741695

ఆ కొండ అంచునే మొలచిన
పచ్చిక బయళ్లపై
ఆ బాల సూర్యుడు పవళించటం ఒక రమ్య దృశ్యం!
ఆ కొండల మీద ఉదయకాలాన్నే
ఒక గొర్రె పిల్ల
పచ్చికను కొరుకుతున్న చిత్రంలో
జీవన శోభ ఉంది
ఏరు పారుతున్నప్పుడు
అడవి నుండి పులి మెల్లగా వచ్చి
దాహం తీర్చుకుంటున్న సడికి
అల గర్వంగా తలెత్తింది
ఆ నది మధ్యలో
పడవలో ఉన్న జాలరి
చీకటిలో వెలుగుతున్న లాంతరు వెలుగులో
తన సుతను
తలంచుకున్న తలంపులో
అనురాగం ఉంది
ప్రతి ప్రారంభానికి
ఒక ముగింపు ఉంది
ప్రతి ముగింపులోనూ
ఒక ప్రారంభం ఉంది
భూవారు మొన్న నీ పల్లకి మోశారు
ఇప్పుడు వారు ఆ పల్లకీనే ఎక్కారు
సమాజం అంతర్గతంగా
వేగంగా పరిగెడుతుంది
బహిర్గతంగా మందంగా కదులుతుంది
ఏవి కల్పించబడ్డాయో
అవి మెల్లగా కరిగిపోతున్నాయి
రూపానికీ, స్వరానికీ
గుర్తింపు వచ్చాక
పైన పూసిన రంగు మృగ్యమవుతుంది
వారిని వీరు కన్నారు
అందుకు ఆధిపత్యాన్ని కోరుకుంటున్నారా!
నాన్నలు అధిపతులు కాదు సుమా!
ఆత్మీయులు
ఆధునికానికీ, సనాతనానికి
ఒక యుద్ధరా
సనాతనంలో స్తబ్దత ఉంది
చీకటి ఉంది
అధునాతనంలో ప్రవాహత ఉంది
సృజన ఉంది
సౌజన్యం ఉంది
వెలుగు ఉంది
వెన్నెల ఉంది
ఇప్పుడు ఆధిపత్యం, ప్రభుత చెల్లదు
ఆ సుభాషిణి
తన తండ్రిని కోల్పోయింది
ఆయన వజ్ర కిరీటాన్ని
ఈమె ధరించింది
ఈమెకు జీవితం మృగ్యమైంది
ఏది బరువో అది బలహీనం కూడా!
మనల్ని మనం కోల్పోయిందేదీ
మనం సాధించలేం!
నిజానికి ఏది ప్రేమ?
ఏది అనురాగం?
స్వేచ్ఛలోనే ప్రేమ దాగుంది
స్వేచ్ఛలోనే విస్తృతీ ఉంది
స్వేచ్ఛలో అమృత ధారలున్నాయి
స్వేచ్ఛలో జీవన సౌరభాలున్నాయి
స్వేచ్ఛ ఓ విజయ పతాక
స్వేచ్ఛ లేని మనిషికి
వజ్ర కిరీటమైనా.. ముళ్ళ కిరీటమే!
నిజమే! ఆ తండ్రి ఆ కూతుర్ని
పెంచి పెద్ద చేశాడు
ఆమె కులాంతరిత అయింది
కత్తి దూశాడు!
ఆమె జీవితాంతం
కత్తి వాదర మీద నడిచింది
నిజమైన ప్రేమకు
కులం అడ్డుగోడ కాకూడదు కదా!
ఆ తండ్రి సనాతనుడు
ఆ కొడుకు అధునాతనుడు
తండ్రి, "దేవుడున్నాడు" అన్నాడు
కొడుకు, "లేదు" అన్నాడు
ఇంటి నుండి గెంటేశారు
ఇది సనాతన ఆధిపత్యం!
భావాలు తరానికి, తరానికి
ఘర్షించటమే గతితర్కం
భావాల ఘర్షణ నుండే
జ్ఞానం పుట్టుక
సమాజానికి, కుటుంబానికి
ఎప్పుడూ ఘర్షణే!
అతడు కుటుంబ పెత్తనాన్ని దాటాడు
ధైర్యం, సాహసం, బుద్ధి కుశలత
అలవడ్డాయి
ఆ పురోహితుని పుత్రుడు
విగ్రహ నిష్ఠను ఉల్లంఘించి
అక్షరాల్ని ధరించాడు
జ్ఞాన సముద్రుడయ్యాడు
నిస్తబ్ధమైన, నిస్తేజమైన
ఆ శిలకు ఆ తలను బలివ్వకుండా
ఆకాశాన్ని అలుముకున్నాడు
ప్రపంచ మానవుడయ్యాడు
నాన్న అక్కడే ఉన్నాడు
కొడుకు జ్ఞానాకాశంలో నక్షత్రమయ్యాడు
నిజమే! నాన్న
భుజాలనెక్కించుకుని పెంచుతాడు
మనం అతణ్ణి శతవత్సరుణ్ణి చేయాలి
కొందరు ప్రపంచాన్ని దోచి
తమ పిల్లలకు కట్టబెడతారు
నెత్తుటి చుక్కలతో
సింహాసనం నిర్మించి
సుతుల్ని ఎక్కిస్తారు?!
ఆస్తి వ్యామోహం
ఒక సజీవ సమాధి
పిల్లలకు స్వేచ్ఛనివ్వండి
ప్రేమనివ్వండి
ప్రేమ ఒక బాధ్యత
ప్రేమ ఒక స్వేచ్ఛ
ప్రేమ ఒక విశ్వ జనీన సూత్రం
ఆ ప్రమోదిని!
గిరులు గీసుకుంటూ జీవిస్తుంది
తనకు తాను సంకెళ్లు బిగించుకుంటుంది
ఉక్కు చట్రంలో మనిషి నుంచి బొమ్మగా
మారింది
స్ఫురద్రూపం నుండి
స్ఫూర్తివిహీనం అయ్యింది
ఎవరో ఆమెతో "మీరు
పుత్ర వ్యామోహితులు" అన్నారు
వ్యామోహం ఏదైనా స్వీయ దగ్ధమే!
మనిషి నిర్వచనాలకు
అతీతంగా ప్రజ్వలించాలి
ఆ తథాగతుడు తండ్రిని,
రాజ్యాన్ని వదిలి
ఒక వృక్షం కింద కూర్చున్నాడు
ఆ చెట్టుకు పూత పూస్తుంది
చూశాడు
ఆకులు రాలుతున్నాయి
చూశాడు
పక్షులు గుంపులు గుంపులుగా వచ్చి
వాలాయి చూశాడు
పక్షులు ఎగిరిపోయాయి
చూశాడు
వీక్షణంలో జ్ఞానం ఉంది
నిర్వీక్షకులు రాజ్య కాంక్షతో
ఇదే ప్రారంభం అనుకుంటారు
నిజానికి!ప్రతి సూర్యోదయానికి
అస్తమయం ఉంది
ప్రతి ప్రారంభానికి ముగింపు ఉంది
అదిగో! ఆ జ్ఞాన సూర్యుడు ఒక్కడే
రాత్రీ, పగలూ వెలుగొందుతున్నాడు!
ఆ ఉదయానికి ముగింపు లేదు.

ఘనంగా జరిగిన పుస్తక జన్మ దినోత్సవం

# "ది గ్రేటెస్ట్ బ్యాటిల్ ఆఫ్ కల్చర్" నవల ఆవిష్కరణ




ఆ పుస్తకం జన్మదినోత్సవం అంటే హరప్పా సింధు ప్రజల సంస్కృతి నాగరికతల జన్మదినోత్సవమే!

బాల సాహితీ వేత్త పాణిగ్రాహి బేతి కలం నుండి వెలువడిన " ది గ్రేటెస్ట్ బ్యాటిల్ ఆఫ్ కల్చర్ " అనే పుస్తకం యొక్క జన్మదిన కార్యక్రమం ఇటీవల జరిగింది. నాలుగు వేలఏళ్లనాటి సింధు నాగరికత , హరప్పా ప్రజలు వారి సంస్కృతి, ఆర్యుల ప్రవేశం వారి జీవన విధానం రెంటి మధ్య సంఘర్షణ కాలక్రమంలో సాగిన సమ్మేళనం ఒక చరిత్ర. ఇటీవల జెనెటిక్సు, డిఎన్ ఏ పరిశోధనలు అనేక నూతన విషయాలను వెలికి తీసాయి. ఇంతదాకా ఉన్న చరిత్రను, చారిత్రక అవగాహనను మలుపు తిప్పాయి. ఈ పరిశోధనల వెలుగులో రాయబడిన ప్రాచీన చరిత్ర కథనమే " ది గ్రేటెస్ట్ బ్యాటిల్ కల్చర్" నవల. నూతన పరిశోధనల వెలుగులో హరప్పా సింధునాగరిక ప్రజలపై ప్రపంచంలో వెలువడిన తొలి నవల ఇది. అమెరికాలో స్థిరపడిన తెలంగాణ ముద్దుబిడ్డ ఈ నవల రాయడం విశేషం. హైదరాబాద్ గచ్చి బౌలి, మైండ్ స్పేస్ సమీపంలోని రాంకీ టవర్సులో ఈ కార్యక్రమం జరిగింది. పాణిగ్రాహి 50 వ జన్మదినం సందర్భాన్ని పెద్ద ఎత్తున జరపాలనుకున్న కుటుంబం ఉత్సాహాన్ని అంగీకరించక పోవడంలో కుటుంబ సభ్యులు ఈ సందర్భాన్ని పాణిగ్రాహి రాసిన పుస్తకానికి జన్మదినంగా నిర్వహించారు. బర్త్ డే కేక్ పుస్తకం ముఖ చిత్రంతో తయారు చేయించడం ఒక నూతన ఆలోచన. బి ఎస్ రాములు పెద్ద కొడుకైన పాణిగ్రాహి 1998 లో అమెరికా వెళ్లి అక్కడి పౌరసత్వం తీసుకున్నారు. బాల్యం నుండే పత్రికలకు అనేక రచనలు పంపి బహుమతులు గెలుచుకున్న పాణిగ్రాహి పుస్తక ప్రియుడు, చిన్నపుడు కె వి నరేందర్, కథలను, సి నర్సింహారావు, యండమూరి వీరేంద్రనాథ్ ల వ్యక్తిత్వ వికాస గ్రంథాలను అభిమానించేవాడు. అమెరికాలో పుస్తక పఠనం మరింత విస్తరించింది. ఆ క్రమంలో రాయబడినదే " ది గ్రేటెస్ట్ బ్యాట్స్ ఆఫ్ కల్చర్" నవల. ఇటీవల అమెజాన్ , ఫ్లిప్ కార్ట్ లలో వేగంగా అమ్ముడవుతున్న నవల గా ప్రశంసలు పొందుతున్నది. నవల వెలువడిన వెంటనే చక్కని లోతైన సమీక్షలు వెలువడడం ఈ నవల విశిష్టత.

రోజలిండ్ గారి ఏహారీ పోటర్ నవల కన్నా భిన్నంగా అంతే ఆసక్తి కరంగా, ప్రతి పేజీ ఉత్కంఠతో ఈ నవల చదివింపజేస్తుంది. ఈ నవల చదవుతుంటే ఆయా దృశ్యాలు సన్నివేశాలు బాహుబలి సినిమా వలె పాఠకుల మనో ఫలకం పై కదలాడుతాయి.

పాఠకుల ఊహాశక్తిని కల్పనా శక్తిని పెంచుతాయి. ఇలా అనుకోకుండా ఒక పుస్తకం తన జన్మదినం జరుపుకోవడం, అది హరప్పా వారసులైన

బంధుమిత్రుల మధ్య కుటుంబ పండుగగా జరగడం ఒక విశేషం.



నవల ఆవిష్కరణలో బి.యస్.రాములు మరియు కుటుంబ సభ్యులు.

## మెరిసిన రేఖ

గాలి విదిలింపుకు
బలంగా తెరుచుకుంది
హఠాత్తుగా కిటికీ రెక్క
కంటిచూపులు కలువలై
దూరంగా సాగాయి
వెలుగుకై వెంపర్లాడుతూ.

చీకటి విరజిమ్మిన మౌనం
అంతటా పరచుకుంది
దూరంగా అక్కడక్కడ
రాతిరిని బంధించాలన్న
మిణుగురుల ఆరాటం
మెరుస్తోంది చుక్కల్లా
తీతువొకటి ..
గానాన్ని గాలితో బంధించి
సాగిపోతోంది శబ్దతరంగంలా
కొమ్మల్లో దాగిన కువకువలు
నిశ్శబ్ద శ్వాసలతో
ముచ్చటిస్తున్నాయి.

రహదారికి ఆ వైపున
ఆకలి నిట్టూర్పులతో
చిల్లుల దుప్పటికింద
మునగదీసుకొని
వెచ్చదనాన్ని కప్పుకుంటోంది
పేదరికం.

గడియ బిగించిన
తలుపుల వెనుక
కంటికి ఎదురుపడని
సంతోష, విషాదాల
దృశ్య కావ్యాలెన్నెన్నో
తొలి వేకువ కూతకు విరిసే
జీవిత పరిణామాలెన్నో
అప్పటిదాకా
గడ్డకట్టుకున్న చైతన్యం
విప్పుకుంది ఒక్కసారి
కదిలే జీవనప్రవాహానికి
కర్తవ్యదీక్షా సంరంభంగా
సంకల్పబలంగా
మెరిసింది మనోరేఖ.



– అరుణ ధూళిపాళ
8712342323



శుక్రవారం రవీంద్రభారతిలో ప్రముఖ రచయిత ముళ్ళపూడి వెంకటరమణ 94వ జయంతి సందర్భంగా ప్రముఖ రచయిత ఎమ్బీయస్ ప్రసాద్‌కు ముళ్ళపూడి వెంకటరమణ స్మారక పురస్కారం ప్రదానం చేస్తున్న డా॥ మోహన్‌కంద, శ్రీమతి ముళ్ళపూడి శ్రీదేవి, ఎస్వీ రామారావు, లంక లక్ష్మీనారాయణ, యాట సత్యనారాయణ, శ్రీమతి శోభారాణి తదితరులు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1191వ రోజు 'సుభాషితం' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'సుభాషితం' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా...

-సంపాదకులు



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు, 9441046839

### దెయ్యాలు- వేదాలు

సుబిరుచిరసుందర
భాబి షణం భూషణం
సుభాషితాలు ప్రజాహితానికి
గురుకులాల్లో బుడతల బుర్రలో
ఆనాటి గురువులు నాటిన
కల్తీలేని విత్తులు
రాజు పేద దాకా
సంస్కృతంలోనూ
తెలుగు శతకాలతోనూ
శోభిల్లిన సమాజం
రాజ్యం
సంస్కారాన్ని ఆచరణలో పెడితే
రామరాజ్యం.
నేడు సుభాషితాలు
దెయ్యాలు వల్లించే వేదాలు
ఏ ఎండకా గొడుగు పట్టు అని
నూరిపోసే నినాదాలు.
పరీక్షల్లో నెగ్గడంకోసం బట్టీ
మార్కుల తో నేర్చిన
సుభాషితాలు నేలపాలు
ఆచరణలో శూన్య హస్తాలు.
ఒకప్పుడు అందరికీ
కరతలామలకాలు
మంచిని గ్రహించి
పెంచి పోషించిన భాండాగారాలు.
నీతి శతకాలు పొత్తాలకే పరిమితం
విత్తం కోసం చదువులు పరుగులు
ఈ చెవితో విని
ఆ చెవితో వదిలే కాలం
బుర్ర నుండి మంచిని
బైటికి గెంటితే తొర్ర
దెయ్యాల కొంప
సమయానికి తగు మాటలాడి
తప్పించుకు పోవడమే
బతుక నేర్చిన వాడి సుభాషితం
నిజం చెప్పి అభాసు కాకు అనే
సుభాషితం పట్టుకు వేలాడే
సమర్థుడే ఆదర్శం.
గురివింద గింజల జీవితాలు
మెరుపుల మాటల చెమక్కులతో
చిత్తు చేసే నక్కజిత్తులదే హవా
దూదూబసవన్నగా మారడం
పదుగురాడుమాట చెల్లు అనే
కొత్త సుభాషితాలు
ఖాతా తెరవడం
ఆచరణలో రావడం ఖాయం.
సాహిత్యం లోనే సుభాషితాలు
ఆచరణలో పెడితే
అభాసుపాలు
నేటి నిజం
కానీ చదువంటే
మమకారం ఉన్న
మనిషన్న వాడు
తన మాట నడతతో
మంచినే పట్టుకుని
వేలాడతాడు.

-ఎ.రాజ్యశ్రీ

### సకలార్థ సాధనం

సు అంటే మంచి
భాషితమంటే భాషణం
వెరసి సుభాషితమో
చక్కని సంభాషణం
సుమధురమైన భాషితం
సుభాషితం
సకలార్థ సాధనం
మంచి వ్యక్తులతో స్నేహం
పలికిస్తుంది సదా సత్యం
తొలగిస్తుంది బుద్ధి మాంద్యం
పెంపొందుతుంది జ్ఞానం
సంఘంలో పెంచుతుంది గౌరవం
తొలగిస్తుంది కల్మషం
మనసును చేస్తుంది నిర్మలం
కలిగిస్తుంది మనో వికాసం
పరువు ప్రతిష్టలను
పెంచుతుంది సత్వరం
సుభాషితం
కలిగిస్తుంది సజ్జన సాంగత్యం.
మంచిని చెప్పడమే సుభాషితం
నడవడికను మార్చేదే సుభాషితం
సుభాషితం చెప్పేవారు దొరకడం
పూర్వ జన్మలో చేసుకున్న పుణ్యం
విని కూడా పెడచెవిన పెట్టడం
మనిషి చేసుకున్న దౌర్భాగ్యం.

-జె.వి.కుమార్ చేపూరి

### మంచి భాషణం

సుభాషితం సకల శ్రేయస్కరం
సుభాషితం అంటే మంచి భాషణమే
నోరు మంచిదైతే ఊరు మంచిది
భాష ఏదైనా భాషణం బాగుండాలి
మాట మంచి తనానికి గీటురాయి
పరువూ ప్రతిష్టలను పెంపొందించి
సమున్నతుడిగా తీర్చిదిద్దేది
మనిషికో మాట పశువుకో దెబ్బ
సుభాషిత రత్నాలు
మనుషులను
సన్మార్గంలో నడిపిస్తాయి
సమాజాన్ని ప్రగతి పథంలో
నడిపిస్తాయి
మాటలో మమకారాలుంటే
సుభాషితం కాజాలదు
అది లోక హితంగా ఉండాలి
లోక కళ్యాణం జరగాలి
నోరు పలకరించి
నొసలు వెక్కిరించినట్లు ఉండరాదు
బద్దెన వేమన మారవి
భర్తృహరి
లోకహితం కోరి
సుభాషిత రత్నాలు రచించారు
దైవ సమానులుగా నిలిచారు
సుభాషితం వ్యక్తిత్వాన్ని పెంచి
ఎదుటివారిలో కలిగిస్తుంది ఆనందం
నోరు జారిన మాట తిరిగి రాదు
భాషణం చేసేప్పుడే
జాగ్రత్తగా ఉండాలి
అది సుభాషితం కావాలి
కలకాలం నిలిచిపోవాలి.

– గుండం మోహన్ రెడ్డి

### వాగ్భూషణం

సుగంధ లేపనాలకంటే
సుభాషణం
సుందరమైన భూషణం
మధుర భాషణమే భూషణమై
వ్యక్తిత్వానికి తెస్తుంది వన్నె!.
చిన్నారి ముద్దు పలుకులు
అచ్చ తెనుగు భాషలో
పదాలు పంచదార చిలుకలు
మంచి మాట తీరు
మనిషి నడవడికకు సూచిక.
కఠినమైన మాటలను తూలువారు
అందరికీ విరోధులు!.
ఎదుటివారిని మార్చగల
మహిమగల పలుకులు
మనిషిలో పరివర్తన కారకాలు
తీవ్ర కలహాలను రూపుమాపి
పలుకులే ఔషధమై
వేదనొందిన మనసుకు
అందిస్తాయి శాంతి!.
పంచదార పూసిన తీయని
పలుకుల్లో మైమరచి
విలువైన జీవితంలో
విషం నింపుకోకు!.

-చంద్రకళ దీకొండ

### జీవన శైలికి మంచి మార్గాలు

సుమధుర భాషితం
సుభాషితం చక్కని భాష
మంచి మాట మంచి సూక్తి
సుభాషితాలు
మానవ జీవన శైలికి
మంచి మార్గాలు.
మన జీవితతత్వాన్ని ప్రభోదిస్తూ
రాసే చక్కని ప్రభోదయం
సూక్తి రత్నాలు
మనలో చైతన్యం నింపే
ఉష: కిరణాలు నీతి శాస్త్రాలు.
భగవద్గీతలో మాధవుడు
లోక కళ్యాణార్థం
అర్జునుని
నిమిత్తునిగా చేసుకుని
మానవాళికి అందించిన
సుభాషిత శ్లోకాలు
అతి దివ్యం
అనంత శక్తిమంతం.
భర్తృహరి, చాణక్యుడు, వేమన
బద్దెన, కాళిదాసు, భవభూతి
మహాత్ములు మహనీయులు
నీతి శతకాల సుభాషితాలతో
మానవులను మేల్కొల్పారు
అభ్యసించి
ఆచరణలో పెడుతున్నవారు
నిర్మల యోగులు
నీతి నిజాయితీపరులు
మహా పురుషులు.
కాశ్మీర్ వల్లభ దేవుడు
సూర్య కళింగ రాయడులాంటి
పండితులు
సుభాషితావళి సూక్తి రత్నాకరంతో
మానవుల జీవితాలకు
మార్గనిర్దేశం
చేస్తూనే ఉన్నారు.
ఇంకా ఎంతో మంది
మహా కవులు
మహనీయులు
తమ సూక్తుల ద్వారా
మానవ జీవితాలకు
మార్గదర్శులుగా నిలుస్తున్నారు.

-ప్రభాకర్ రావు గుండవరం

### ఆచరణ యోగ్యత

అనుభవాలు రంగరించి
తీరుతెన్నులు నిర్ధారించి
హితం ఆపాదించి
ఆచరణకు యోగ్యమైన
భాషితాలే సుభాషితాలు.
నడి సంద్రంలో
ఆటు పోట్లలో
నిలకడగా
నావనడిపే నావికుడు
అదురు బెదురులతో
రహదారిపై
వాహనాలను నడిపే చాలకుడు
కాయకష్టం చేసే
అన్నదాత కర్షకుడు
యంత్రాల సందడిలో
ఉత్పత్తి చేసే కార్మికులు
బతుకుతెరువులను ఆశ్రయించి
జ్ఞాన కుశలతలనొసగే
గురుదేవులు
కని పెంచి
సత్సంస్కారాల ప్రయోజకుడిని
కాంక్షించు తల్లితండ్రులు
పలికేవన్నీ శుద్ధ సుభాషితాలే
నమ్మకాన్ని
వమ్ము కానీయని మహనీయులు.

-రాజప్ప

### మంచిమాట

అనుభవ పూర్వక హితం
ఆచరించే హితం
పాటిస్తే
పదిమందికి హితం
సుభాషితం.
మంచి చెడులను
ఓర్పు నేర్పులను
చాకచక్యంతో తెలియచెప్పి
ఆచరించి
పాటించేందుకు అమలు జరిపే
సుగమ మార్గం.
అనుసంధానంతో
అవలంబించేందుకు
అంతరంగ విశ్లేషణ అత్యవసరం
నిత్య జీవితంలో
నిర్భాగ్యపు నీడలు
తప్పుకొనే మార్గం
తప్పించుకొనే దారి
తెలియజెప్తాయి
భారరహిత జీవనం కోసం.
అద్భుత వరాల పంట
మానవాళికి ఆశీస్సులతో
అదృష్టాలనందించిన
దివ్యవరం
సౌభాగ్యం సుభాషితం!

– కె.కె.తాయారు

### వినదగు...

సు మంచికి మరో పేరు
భాషితం మాట
సుభాషితం
వినదగు
ఎవరు చెప్పిన
ఎపుడు చెప్పిన
ఎన్ని సార్లు చెప్పినా
మంచి గా మాట్లాడటం
ఒక కళ
ఎవర్నీ నొప్పించక
తానొవ్వక మధురంగా
మాట్లాడితే
అభిమానులకి కొదవలేదు
విలువలు పెంపుదల
పేరు ప్రతిష్టల ఆగమనం
మాట ఒక పదునైన ఆయుధం
వాడి కత్తికంటే పదునెక్కువ
అప్పుడే
సుభాషితాల విలువ తెలిసేది.

-మోటూరి శాంతకుమారి

### అనుసరణీయాలు

అందరూ చెబుతున్నారు
ఇలాగే ఉండాలని
ఆలాగున ఉండరాదనీ
సుభాషితాలు విని
వదిలేసేవి కావని
జీవన పర్యంతం
ఆచరణీయాలనీ
అందరూ అంటారు
సత్య వాక్కు
ముమ్మాటికి సుభాషితమే
ధర్మం నిలుపుతూ జీవితం
ధర్మరాజు కే కష్ట తరమైతే
కృష్ణ ఆశీస్సులతో
గెలిచి ఆదర్శంగా
నిలిచిచూపారు.
గాంధీకి సత్యంతో సహజీవనం
కాలేదా కష్టతరం
అభ్యసిస్తే ఎంతో
ఆనందం పంచలేదా
శుభం కలిగించు భాషితమేదైనా
సుభాషితమేనన్నది
తెలుసుకుంటూ
ఆ గొప్పదనాన్ని
జీవన గమనంలో
ప్రస్ఫుటం చేసుకుంటూ
ఉత్తములమనిపించుకుందాం.

– ప్రశాంతి రేవూరి

### సుమభాషితం

సుభాషితం
సుమధుర భాషితం
సుమభాషితం కావాలి
సుభాషితాలు విని ఆచరించాలి
సుభాషితాలు చెప్పారెందరో
మహనీయులు
భర్తృహరి నీతిశతకం
చెప్పింది నీతులెన్నో
ఏనుగు లక్ష్మణుడు
బద్దెన వేమన నీతులు
నీతిశతకాలు
నీతిచంద్రికల సారమెంతో
సామాన్యుడి భాషలో
సుభాషితరత్నాలు
ప్రతి భాషణం ఒక అమృతభాషణం
సుధలు చిందే
సుభాషిత రసధారలో
మాట ఒకటి మారుస్తుంది
మనిషి మనుగడను
మనిషి స్వరూపం
తేటతెల్లం మేడిచందం
తివిరి ఇసుకన తైలం
మూర్ఖుడిమదితో
సుభాషితాలు కోకొల్లలు
చెప్పేటందుకే నీతులు అన్నచందం
నిన్నటి భాషణం నేటి ప్రతిభాషణం
తిరగవేసి వల్లెవేత
నేటి భాషణాలు
మాయమాటల
మోహావేశాలిప్పుడు
మదిలోని సుభాషితాలు
మందసలోకి
మనం అభివృద్ధి పేర
ఆకర్షణల్లోకి
మనిషి మారుతాడెప్పుడో
నైతికతలోకి
మాయా ప్రపంచం
మారుతుందెప్పుడో
స్వార్థం మోహం వీడి
సుభాషితం వైపుకు.

– లక్ష్మారెడ్డి పసుల


## పట్టిసీమ నుంచి గోదావరి పరవళ్లు .. కృష్ణా డెల్టా రైతాంగం కోసం నీరు విడుదల చేసిన మంత్రి నిమ్మల

అమరావతి, జులై 3 :క్యూసెక్కులకు, టీఎంసీలకు తేడా తెలియని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సాగునీటి వ్యవస్థను భ్రష్టు పట్టించారని, అనడానికి పులిచింతల, పోలవరం ఒక ఉదాహరణగా నిలిచాయాని విమర్శించారు ఏపీ జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు? ప్రజల తాగు నీటి అవసరాలు కూడా ప్రాజెక్టులలో నీటిని నిలువ చేయలేకపోయారని మండిపడ్డారు. పట్టిసీమ ఎత్తిపోతల నుంచి నేటి ఉదయం జలవనరుల శాఖ ప్రత్యేక పూజల అనంతరం గోదావరి నీటిని విడుదల చేశారు.

అనంతరం పట్టిసీమ డెలివరీ పాయింట్ వద్ద మీడియాతో మాట్లాడుతూ, తన ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేయమని అధికారులను విశాఖపట్నం పంపిన వైఎస్ జగన్.. ప్రజల తాగునీటి అవసరాలకు మాత్రం చర్యలు తీసుకోలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు.. కరువు రహిత దేశంగా, రాష్ట్రంగా ఉండాలి అంటే నదుల అనుసంధానం ముఖ్యం అని నమ్మిన వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. పోలవరం ప్రాజెక్టు ఆలస్యం అవుతుందని ముందు చూపుతో పట్టిసీమ ప్రారంభించారన్నారు. పట్టిసీమ ప్రారంభించినప్పుడు ఒట్టి సీమ అంటూ.. వైఎస్ జగన్ అవహేళన చేశారని, ఇప్పుడు అదే పట్టిసీమ ద్వారా రైతుల కష్టాలు తీర్చుతున్నామని స్పష్టం చేశారు.ఇక పోలవరం కుడి కాలువలో గోదావరి నీరు పరవళ్లు తొక్కుతోం దీంతో 1000 క్యూసెక్కుల నీరు పట్టిసీమ డెలివరీ పాయింట్ వద్ద ద్వారా పోలవరం కుడి కాలువలోకి చేరుతోంది. కృష్ణ డెల్టా రైతులకు సాగునీరు అందించేందుకు ముందస్తుగా పట్టిసీమ ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. దీనిపై మంత్రి వివరణ ఇస్తూ భవిష్యత్తు అవసరాల మీద నీటి విడుదల శాతాన్ని అధికారులు మరింత పెంచానున్నారు. . సముద్రంలో వృథాగా పోతున్న నీటిని ఒడిసి పట్టి ఆంధ్ర రాష్ట్రాన్ని కరువు రహిత రాష్ట్రంగా మార్చేందుకు పోలవరం ప్రాజెక్టుకు చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు.


ఆహ్వానం

కిన్నెర ఆర్ట్ థియేటర్స్
హైదరాబాద్




శ్రీ కొక్కుల శివకృష్ణ
రచించిన
సముద్ర నానీలు
గ్రంథావిష్కరణ
ఆదివారం 07-07-2024
ఉదయం 10 గంటలకు
రవీంద్రభారతి సమావేశ మందిరం,
మొదటి అంతస్తు, హైదరాబాదు



ముఖ్యఅతిథి - ఆవిష్కర్త
డా॥ ఎన్. గోపి
పూర్వ వైస్ ఛాన్సలర్, తెలుగు విశ్వవిద్యాలయం
కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత

సభాధ్యక్షులు
ఆచార్య సూర్యా ధనంజయ
పూర్వ అధ్యక్షులు, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం

విశిష్ట అతిథులు :
డా॥ పోరెడ్డి రంగయ్య
ప్రముఖ కవి, వ్యాఖ్యాత
శ్రీ కుడికాల వంశీధర్
ప్రముఖ కవి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

గౌరవ అతిథులు
శ్రీ సుంకరి కృష్ణ ప్రసాద్, ప్రముఖ కవి
శ్రీ చిత్తలూరి సత్యనారాయణ, ప్రముఖ కవి

డా॥ ఆర్. ప్రభాకరరావు, ఐ.పి.ఎస్. (రి) అధ్యక్షులు
మద్దాళి రఘురామ్ కార్యదర్శి



**నేటినిజం సభ్యత రుసుము**

ప్రతి వారం ప్రచురిస్తున్న 'సాహితీ కెరటాలు' గల 'నేటినిజం' 5 సం॥రాలకు రూ.700/-లు. 10 సం॥రాలకు రూ1200/-లు. పత్రిక కావాలనుకున్నవారు సభ్యత రుసుమును సెల్: 9705011453 కి గూగుల్‌పే మరియు ఫోన్‌పే ద్వారా పంపవచ్చు.


'నేటినిజం' దినపత్రిక,
ఎస్ఆర్‌టి-169, జవహర్‌నగర్, హైదరాబాద్-500 020.


## సాహిత్యరంగంలో నామినేట్ పదవులను ఆయా శాఖల్లో అనుభవం ఉన్నవారినే నియమించాలి

విజయవాడ; జూలై 3: కొత్తగా ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాహిత్యరంగానికి సంబంధించి త్వరలో భర్తీ చేయనున్న నామినేట్ పదవులను ఆయా శాఖల్లో అనుభవం ఉన్నవారినే ఎంపిక చెయ్యాలని ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరుతోంది.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, తెలుగు అకాడమి, అధికార భాషా సంఘం, గ్రంథాలయ పరిషత్ తదితర సాహిత్యరంగానికి చెందిన శాఖల్లో నియమించే రాష్ట్ర ఛైర్మన్‌లు, జిల్లా ఛైర్మన్‌లు, సభ్యులను సాహిత్యేతరులతో కాకుండా ఆయా రంగాల్లో జాతీయ స్థాయిలో విశేష అనుభవం ఉన్నవారినే ఎన్నుకోవాలని ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం సూచిస్తోంది. అలాగే కవులు, రచయితలు, కళాకారులకు ఇచ్చే ఉగాది పురస్కారాలు, కళారత్నా అవార్డులు ఇవ్వడం కొనసాగించాలని, గత ప్రభుత్వం వీటిని విస్మరించడం వల్ల సాహిత్యరంగంలో నిరుత్సాహం నెలకొందని తెలిపింది. అలాగే గత ప్రభుత్వం కవులు, రచయితలు, ప్రచురణకర్తలనుండి జిల్లా గ్రంథాలయ సంస్థలు పుస్తకాలు కొనుగోలు చేసాయని, కాని రెండున్నర సంవత్సరాలు గడిచినా కొన్ని జిల్లా సంస్థలనుండి లక్షలాది రూపాయల బిల్లులకు సొమ్ము విడుదల జరగలేదని, దయచేసి ఈ ప్రభుత్వం దీని తాలుకా సొమ్మును వెంటనే విడుదల చెయ్యడంతోపాటు, కొత్త పుస్తకాలు కొనుగోలు ప్రక్రియకు శ్రద్ధ చూపాలని ఆయా శాఖా మంత్రివర్యులను ఈ ప్రకటన ద్వారా ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం విజ్ఞప్తి చేస్తున్నది. అలాగే కవులు, రచయితల పుస్తకాలు ప్రచురించుకునేందుకు గతంలోలాగే భాషా సంస్కృతిక శాఖా ద్వారా ఆర్థిక సహాయం అందించేలా కృషి చెయ్యాలని, అన్నిరంగాల అభివృద్ధితోపాటు తీవ్ర నిస్పృహ, నిస్తేజంతో ఉన్న సాహిత్యరంగ అభివృద్ధికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృషి చెయ్యవలసిన అవసరం ఎంతైనా ఉందని, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులను, రాష్ట్రమంత్రివర్యులను రచయితల సంఘం కోరుతున్నది.

-డా. సి.భవానీదేవి, అధ్యక్షులు
-చలపాక ప్రకాష్, ప్రధాన కార్యదర్శి


ఆహ్వానం
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
భాషా సాంస్కృతిక శాఖ
సహకారంతో
కిన్నెర ఆర్ట్ థియేటర్స్
ప్రముఖ సాహితీవేత్త
డా॥ వోలేటి పార్వతీశం రచించిన
కొన్ని ఊసులు
ఇంకొన్ని ఊహలు
కవితా సంపుటి
ఆవిష్కరణ-అంకితోత్సవం
06-07-2024 శనివారం, సా॥ 6 గం॥లకు
రవీంద్రభారతి సమావేశ మందిరం
(మొదటి అంతస్తు), హైదరాబాద్.



ముఖ్య అతిథి : డా॥ కె.వి. రమణ, ఐ.ఏ.ఎస్. (రి)
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు
అధ్యక్షులు : శ్రీ మండలి బుద్ధప్రసాద్
శాసన సభ సభ్యులు, ఆంధ్రప్రదేశ్
విశిష్ట అతిథి : డా॥ ఏనుగు నరసింహారెడ్డి, స్పెషల్ గ్రేడ్ డిప్యూటి కలెక్టర్
గౌరవ అతిథి : శ్రీ నగ్నముని, దిగంబర కవితోద్యమ ప్రయోక్త
ఆత్మీయ అతిథి : శ్రీమతి శైలజామిత్ర, రచయిత్రి
కృతి స్వీకర్త : శ్రీమతి ప్రేమామాన్వి, దూరదర్శన్ పూర్వ ప్రయోక్త

ప్రముఖ గాయని శ్రీమతి సురేఖామూర్తి దివాకర్ల
లలిత సంగీత విభావరి

డా॥ ఆర్. ప్రభాకరరావు, ఐ.పి.ఎస్. (రి) అధ్యక్షులు
మద్దాళి రఘురామ్ కార్యదర్శి


## పరిశోధకులకు మార్గనిర్దేశనం ఇనాక్ రచనలు



సభలో ప్రసంగిస్తున్న అయాచితం శ్రీధర్

పరిశోధకులకు ఇనాక్ రచనలు మార్గనిర్దేశనం చేస్తాయని తెలంగాణ గ్రంథాలయ పరిషత్ మాజీ చైర్మన్ అయాచితం శ్రీధర్ అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సమాలోచన సప్తాహం లో భాగంగా అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి ఇనాక్ పరిశోధన సాహిత్యంపై సోదాహరణ ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ బడుగుజీవుల పక్షాన నిలిచి ఇనాక్ రచనలు చేస్తున్నారన్నారు. చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ఇనాక్ రచించిన తెలుగు వ్యాస పరిణామం సమగ్రమైన సాహితీ పరిశోధన అన్నారు. రచించిన తెలుగు వ్యాస పరిణామం సమగ్రమైన సాహితీ పరిశోధన అన్నారు.జానపద సాహిత్యమే భాషా సంపదకు మూలం అని ఇనాక్ స్పష్టం చేశారన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షత వహించిన సభలో ఆచార్య కొలకలూరి ఇనాక్ ధన్యవాదాలు తెలిపారు. బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## డాలస్‌లో డా॥ వడ్డేపల్లి కృష్ణ గీతావిష్కరణ, సన్మానం



అమెరికా 'డాలస్' మహా నగరంలోని శిర్డీసాయి ఆడిటోరియంలో "ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం" ఆధ్వర్యంలో 'నెలనెలా తెలుగు వెన్నెల' ద్విశతి మాసోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. దయాకర్ మాడ సమన్వయకర్తగా వ్యవహరించారు. విశిష్ట అతిథులుగా డా॥ వడ్డేపల్లి కృష్ణ, సినీ దర్శకులు వి.ఎన్. ఆదిత్యను, ముఖ్య అతిథిగా ప్రసిద్ధనటులు, రచయిత తనికెళ్ల భరణిగారిని వేదిక మీదికి ఆహ్వానించి సభాసదులకు పరిచయం చేశారు. వి.ఎన్. ఆదిత్య 'సినీ మాయాజాలం'పై ప్రసంగించగా, డా॥ వడ్డేపల్లి కృష్ణ "లలిత గీత వికాసం"పై ఉపన్యసించారు. ఆ తర్వాత తోటకూర ప్రసాద్ గారి సూచనతో వడ్డేపల్లి కృష్ణ రచించిన "నెలనెలా నెలనెలా తెలుగు వెన్నెలా –జలజలా కురిసే తెలుగు వెన్నెలా' అనే గీతాన్ని తనికెళ్ల భరణి ఆవిష్కరించి ప్రశంసించారు. 'పాడుతా తీయగా' ఫేమ్ కుమారి శివాత్మిక ఆ గీతాన్ని మృదుమధురంగా గానం చేసి అందరినీ అలరించింది.

కోరినంతనే అద్భుతంగా తమ ద్విశతి మాసోత్సవ గీతాన్ని రచించిన డా॥వడ్డేపల్లి కృష్ణను సంస్థ అధ్యక్షులను బండారు సతీష్, చంద్రశేఖర్ శాలువా, పుష్పగుచ్ఛంతో తనికెళ్లభరణి చేతుల మీదుగా సన్మానించారు. అతి తక్కువ సమయంలోనే అద్భుతంగా గీతాన్ని రచించి అందించినందుకు తోటకూర ప్రసాద్‌గారు వడ్డేపల్లి కృష్ణను, శ్రావ్యంగా ఆలపించి అలరించినందుకు శివాత్మికను అభినందించారు.

చివరలో సుబ్బు జొన్నలగడ్డగారు తమ సంస్థ పూర్వ అధ్యక్షుల్ని సభకు పరిచయం చేస్తూ వందన సమర్పణ గావించారు.

సాహిత్యం, సామాజిక సేవ,



నిర్వహిస్తున్న
## 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు

అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123

నిర్వహణ: శ్రీమతి సత్య



### మనసున మనసై

మదిలో తెలియని ఊహలు
మనసులో కదిలే రూపాలు
చిరునవ్వుల దరహాసాలు
నాలో తెలియని గుసగుసలు
మనసున మనసై....
మధుర ప్రేమ.
కదిలిన జ్ఞాపకాల దొంతరలు
మెదిలిన వ్యాపకాల భ్రమలు
ఆలోచన కలిగిన కదలికలు
మెరిసిన ఆనందపు కేరింతలు
మనసున మనసై....
చిలిపి ప్రేమ.
యేమని చెప్పను నేస్తం
ఎందాక వెతకను ప్రియ నేస్తం
నీ కోసం వెతికే నా మనసు
అడియాశల ఆశల బతుకు
మనసున మనసై....
విరహ ప్రేమ.
ఏదో చెప్పాలని తపన
ఏమి చెయ్యలేని నిరీక్షణ
అమాస చీకటిలో అంధకారమై
కను రెప్పల మాటున రూపమై
నా మనసున మనసై....
తొలి ప్రేమ.
నీ తీయని పిలుపుకై నా ఆరాటం
నీ చిలిపి నవ్వుకై నా మౌన పోరాటం
నా మనసులో దాగిన యామిని
నా స్వప్నం లో విహరించే భామిని
రావా మనసున మనసై....
అమర ప్రేమ

-షేక్ రహీమ్ సాహెబ్
7330938773

### అమర ప్రేమ

కంటి చూపుతో
మొదలైన పరిచయము
నవ్వుల పూలు రెక్కలు విప్పుకొని
మాటల వర్షంలో తడుస్తు
ప్రేమ కోటకు పునాది వేస్తారు.
ప్రేమ పరుగులో
హార్డిల్స్ లాగ అడ్డుతగిలే
ఆచారపు కట్టుబాట్లు
అడుగులేయనీకుండా
ఆపాలని చూస్తుంటే అణచబడ్డ
ప్రేమ స్వేచ్ఛా విహంగమై
విహరించాలని చూస్తుంది.
వయసు ఉరకలేస్తుంటే
మనసు ఉబికివచ్చే
కోరికల అలలపై ప్రేమ తీరాన్ని
చేరుకోవాలని ఆరాటపడుతు
ఆగకుండా అడుగులేస్తుంది.
త్యాగానికి తల్లివేరులా ప్రేమ
బీజాలు చల్లుతు కడదాక
కలిసి ఉండే కమ్మని ఆశతో
కష్టాన్ని కట్టిపడేసి కమ్మని
కలల ఊయలలో ఊగుతుంది.

-డా.బి.సుధాకర్

### చరిత్ర సాక్ష్యం

ఒక లైలా ,ఒక మజ్ను
ఒక సలీమ్, ఒక అనార్కలి
ఒక పార్వతి..ఒ కదేవదాసు
చరిత్ర పుటలలో అమర ప్రేమకు
భాష్యమై నిలిచిన ప్రేమజీవులు
పరువు ప్రతిష్ఠల పెత్తందారీలకు
బలైపోయిన అమర ప్రేమికులు
ప్రేమ కావ్యానికి గురుతులుగా
మిగిలిన సంతకాలు.
ప్రేమే నేరమై
ప్రేమ లేని మనుగడ భారమై
ప్రేమను అర్థంచేసుకోలేని
పెద్దలను ఎదిరించలేక
వారిలో మార్పు తేలేక
ప్రేమను బలిపెట్టలేక
తమ ప్రాణాలనే ఆహుతి చేసుకుని
తమ జీవితాలకు ఇచ్చుకునే
ముగింపు తీర్పు.
ప్రేమ గాథలు విషాదాలుగా
మిగిలిపోవలసిందేనా
ప్రేమను గెలిపించుకోలేని
జ్ఞాపకాలుగా చరిత్రలో
మిగిలిపోవలసిందేనా
అమర ప్రేమకు గురుతులు సమాధులేనా
ప్రేమ పండితే మధురం
ప్రేమ విషాదమైతే అమరం.

-కొలచన విజయ భారతి

### అమర ప్రేమ

అదేమిటో...
చూపుల్లోంచి ప్రసరించే వెన్నెల
మనసంతా
చల్లని మమతల వర్షంతో
తడుపుతూ...
కనుల కొలనులో
అనురాగాల అరవిందమై విరుస్తూ
ఆలోచనల తుమ్మెదలన్నింటినీ
తన చుట్టే పరిభ్రమింప చేస్తూ...
ఆకలి దప్పుల మాటలను ఏమార్చి
సదా సాన్నిధ్యపు
స్మరణల్లో ముంచుతూ
కలిసి జీవించాలనే
నిర్ణయపు మూడు ముళ్ళను
గట్టిగా బిగించి ఒక్కటిగా చేసేదే
అమర ప్రేమ!
కష్టాలైనా ఇష్టాలైనా
సుఖమైనా దుఃఖమైనా
ఇరు దేహపు తంత్రుల్లో
ఒక్కటే అనుభూతి
అదే మధురమైన జీవితానికి
అందమైన బహుమతి!
అర్థ నారీశ్వరమా...
అజరామరమైన విశ్వజనీన తత్వమా..
ఏదైతేనేం అమరత్వం దాని సొంతం
ప్రేమత్వమే తన సంతకం!
ఇలలో ఇదే కదా శాశ్వతం..

-పురిమళ్ల సునంద,
డల్లాస్ అమెరికా

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com